http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

సోమవారం 6 జూలై 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## చకచకా నిర్మాణ పనులు



- చకచకా 2 భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు
- పూర్తైతే గంట ప్రయాణం 15 నిమిషాల్లోనే
- హైదరాబాద్‌లో తగ్గనున్న ట్రాఫిక్ కష్టాలు
- వేగంగా సాగుతున్న కారిడార్ల నిర్మాణం
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న హెచ్ఎండీఏ అధికారులు
- రెండేళ్లలో నిర్మాణాలు పూర్తిచేస్తామని వెల్లడి
- పూర్తయితే ఉత్తర జిల్లాలకు వేగంగా ప్రయాణం



## అయోధ్య రామమందిర విరాళాల కేసులో దోషులకు కఠిన శిక్ష పడాలి

- అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం కేసు
- బీజేపీ– ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు
- ప్రతిపక్ష నేతల్ని విచారించాలని డిమాండ్ చేస్తున్న వీహెచ్‌పీ

## రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయి

### హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్రమంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు

- గత సమావేశాల్లోని నిర్ణయాలు అమలు కావడం లేదు
- కేంద్రమంత్రులకు రేవంత్ మరోసారి లేఖలు
- గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్న సీఎం
- వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి
- మెట్రో మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయి
- మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలి
- తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో రైలు విస్తరణను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది



హైదరాబాద్

మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు రాశారు. గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్నారు. మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని సీఎం కోరారు. షరతులు, విధివిధానాలు వెంటనే ఖరారు చేయాలన్నారు. మెట్రో మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయని, వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి లేఖల్లో కోరారు. మెట్రో రైలు - మిగతా3లో

## వర్షాకాల వ్యాధుల నివారణకు సీఎంసీ సరికొత్త పద్ధతి

- నాలుగంచెల ప్రణాళికతో ప్రత్యేక యూనిట్
- సైబరాబాద్‌లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక ప్రణాళికలు
- మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్పొరేషన్
- ఐదు సూత్రాల కార్యాచరణతో ప్రణాళికల అమలు
- క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేసేలా సన్నాహాలు



హైదరాబాద్

వర్షాకాలం వచ్చిందంటే చాలు దోమల ఉద్ధృతి, కలుషిత నీటి ద్వారా రకరకాల వ్యాధులు ప్రబలుతుంటాయి. గాలిలోని తేమ వల్ల హానికారక క్రిములు వృద్ధి చెందే అవకాశం ఎక్కువ. ఇది మన వ్యాధి నిరోధక శక్తిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ కాలంలో అంటువ్యాధులు త్వరగా వ్యాప్తి చెందే అవకాశం చాలా ఎక్కువ. వీటిని నివారించేందుకు ప్రభుత్వాలు పలు చర్యలు చేపడుతూ వస్తున్నాయి. తాజాగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అడ్డుకోవడానికి సరికొత్త వ్యూహంతో ముందుకు వచ్చింది. ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రధాన ధ్యేయంగా మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎంఎస్‌యూ) ను సీఎంసీ అందుబాటులోకి తెచ్చింది. ఈ యూనిట్ నిరంతరం పనిచేస్తూ వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు - మిగతా3లో



## రామమందిర విరాళాల దోపిడీకి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే బాధ్యత వహించాలి

- రామాలయ విరాళాల చోరీపై మండిపడ్డ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- ఈ దోపిడీకి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే బాధ్యత వహించాలని డిమాండ్
- రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ మతాన్ని వాడుకుంటుంది
- ఎస్ఐఆర్, డీలిమిటేషన్‌ను వాడుకుంటూ బీజేపీ సర్కార్ 'ఓట్ చోరీ' చేయడానికి ప్రయత్నిస్తోంది

## గ్యాస్ సరఫరాపై అత్యవసర ఆంక్షలు ఎత్తివేత

- సహజవాయువు సరఫరాపై అత్యవసర ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేత
- హర్మూజ్ జలసంధి మీదుగా ఎల్ఎన్‌జీ నౌకల రాకపోకలు తిరిగి ప్రారంభం
- పశ్చిమాసియా సంక్షోభం కారణంగా మార్చి 9న ఈ ఆంక్షలు విధింపు
- తాజా నిర్ణయంతో పరిశ్రమలు, గ్యాస్ వినియోగదారులకు ఉపశమనం






## హర్మూజ్‌లో ప్రయాణించే నౌకలకు రుసుం..

- హర్మూజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలపై సేవా రుసుం వసూలు చేయనున్న ఇరాన్
- అమెరికాతో కుదిరిన 60 రోజుల ఉచిత ప్రయాణ గడువు ముగిశాక ఈ నిర్ణయం అమలు
- ఇవి టోల్ ఫీజులు కావని, భద్రతా సేవల కోసమే వసూలు చేస్తున్నామని వెల్లడి
- తమకు మద్దతిచ్చిన స్నేహ దేశాలకు రుసుములలో ప్రత్యేక రాయితీలు ఇస్తామని ప్రకటన

## రైతుల్లో ఎల్‌నినో టెన్షన్



- నేటితో ముగుస్తున్న ఆరుద్ర కార్తె..
- ఇప్పటివరకు కేవలం 1.94 లక్షల ఎకరాల్లోనే వరిసాగు
- ఇతర పంటలు కూడా అంతంత మాత్రమే
- బావులు, బోర్ల కింద వరి సాగు.. చెరువులు,కాలువల కింద కదలని నాగళ్లు

హైదరాబాద్

ఖరీఫ్ సీజన్‌కు అత్యంత కీలకంగా భావించే ఆరుద్ర కార్తె ఆదివారంతో ముగుస్తున్నా.. రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వ్యవసాయ పనులు ఊపందుకోలేదు. వర్షాలు ఓ మోస్తరులో కూడా కురవకపోవడంతో రైతులు వరి నారుమళ్లను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. కొన్ని జిల్లాల్లో వర్షాలు కురిసినా... అవి సాగుకు సరిపోక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బావులు, బోర్ల కింద నీటి సౌకర్యం ఉన్న రైతులు మాత్రమే నార్లు పోస్తుండగా, వర్షాధార రైతులు ఇంకా ఎదురుచూపులకే పరిమితమయ్యారు. సాధారణంగా ఆరుద్ర కార్తెలోనే వరి నార్లు వేయడం, నాట్లు ప్రారంభించడం జరుగుతుంది. ఆరుద్ర దాటితే 'కాలం ఎత్తిపోయింది'అనే మాట ఉత్తర తెలంగాణలో ఎక్కువగా వినబడుతుంది. గత సంవత్సరం కూడా వర్షాలు ఆలస్యంగా కురవడంతో జూలై మొదటి వారం తరువాతే వరి నార్లు పోసే ప్రక్రియ వేగం అందుకోగా, ఈసారి మాత్రం ఆ జాడ కనిపించడం లేదు. నార్లు - మిగతా3లో



## ఎన్నికల బరిలోకి ప్రశాంత్ కిశోర్

- బీజేపీ కంచుకోట నుంచి పోటీ
- బీహార్ బంకిపుర్ అసెంబ్లీ ఉపఎన్నికలో పోటీకి దిగుతున్న ప్రశాంత్ కిశోర్
- దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గం ఇది
- కిశోర్‌కు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, ఆర్జేడీ నిర్ణయంపై ఉత్కంఠ
- జులై 30న పోలింగ్, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు

# రామమందిర విరాళాల దోపిడీకి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే బాధ్యత వహించాలి

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అధికారాన్ని నిలుపుకోవడానికి ఎస్ఐఆర్, డీలిమిటేషన్‌ను వాడుకుంటూ బీజేపీ సర్కార్ 'ఓట్ చోరీ' చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకోవడమే కాకుండా, ఎన్నికల అవకతవకల ద్వారా ప్రజాస్వామ్య సంస్థలను కూడా బలహీనపరుస్తోందని మండిపడ్డారు. కర్ణాటకలోని చిక్కబళ్లాపురలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మల్లికార్జున ఖర్గే ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ సర్కార్‌పై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించారు. "అయోధ్యలో దేవుడి పేరుతో ఎంత దోపిడీ జరుగుతోందో మీరు చూశారు. అయోధ్యలో ఏం జరిగింది? పేదవాళ్లు విరాళాలను దుర్వినియోగం చేశారా? దళితులు చేశారా? రైతులు చేశారా? ఎవరూ కాదు. ఆర్ఎస్ఎస్, బీజేపీలతో సంబంధం ఉన్నవారే ఈ దోపిడీ చేశారు. అయోధ్య రామ మందిరంలో సుమారు రూ. 20,000 కోట్ల విలువైన ఆస్తులను దోచుకున్నారు. రామ మందిరానికి విరాళంగా ఇచ్చిన బంగారం, వెండి, చివరికి ఇటుకలను కూడా దోచుకున్నారు. ప్రతిరోజూ దేవుడి నామం జపిస్తారు. కానీ దేవుడి పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. "



**పాలనపై కాకుండా ఎన్నికలపైనే బీజేపీ దృష్టి : ఖర్గే**

బంగాల్, మహారాష్ట్ర, హరియాణా, అసోం వంటి రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ద్వారా బీజేపీ 'ఓట్ చోరీ'కి పాల్పడిందని ఖర్గే ఆరోపించారు. అధికారంలో కొనసాగడానికి కమలం పార్టీ రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు. బీజేపీ/ఆర్ఎస్ఎస్ ఓట్లను చోరీ చేస్తున్నాయని దుయ్యబట్టారు. దేవుడి సంపదను దోచుకుంటున్నాయని విమర్శించారు. ఇటువంటి దుర్వినియోగాన్ని నివారించడానికి బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ఒకే దేశం- ఒకే ఎన్నిక బిల్లు వంటి వాటిని సభ ముందుకు తీసుకురావాలని బీజేపీ చూస్తోందన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆహార భద్రతా చట్టం వంటి సంక్షేమ చర్యలను ఎన్‌డీఏ సర్కార్ బలహీనపరుస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం పరిపాలనపై కాకుండా కేవలం ఎన్నికలపైనే దృష్టి సారిస్తోందని ఎద్దేవా చేశారు.

"రాబోయే వర్షాకాల సమావేశాల్లో బీజేపీ డీలిమిటేషన్ బిల్లును తీసుకురావాలనుకుంటోంది. డీలిమిటేషన్ ద్వారా తమకు అనుకూలమైన రీతిలో పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలను మార్చాలనుకుంటోంది. బీజేపీ ఇప్పటికే అసోంలో డీలిమిటేషన్ చేసింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా దీనిని అమలు చేయాలని చూస్తోంది. కాంగ్రెస్ ఒకసారి దీనిని వ్యతిరేకించి, దానిని ఉపసంహరించుకునేలా బీజేపీని ఒత్తిడి చేసింది. అంబేద్కర్ ఆధునిక భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు రూపశిల్పి. బాబాసాహెబ్ అంబేద్కర్ 140 కోట్ల మంది భారతీయుల తలరాతను రాశారు. ఆయన లేకపోయి ఉంటే దళితులకు రాజకీయ హక్కులు, విద్య, ప్రాతినిధ్యం లభించేవి కావు. అంబేద్కర్ వల్లే ప్రతి భారతీయుడికి ఓటు హక్కు లభించింది. రాజ్యాంగ విలువలు బలహీనపడితే ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం ప్రమాదంలో పడుతుంది. రాజ్యాంగాన్ని ప్రజలు పరిరక్షించాలి. ఏ పేదవాడూ ఆకలితో ఉండకూడదనేది మన లక్ష్యం కావాలి. ప్రజలకు పని, ఆహారం, గౌరవం ఇవ్వాలి. కానీ బీజేపీ కేవలం ఓట్ల గురించే ఆలోచిస్తోంది"

**విరాళాల చోరీపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారు : మాణికం ఠాగూర్?**

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు మాణికం ఠాగూర్? ప్రశ్నించారు. రామమందిర విరాళాలకు సంబంధించి ఆర్థిక కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఈ అంశంపై ప్రధాని మోదీ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆలయాలను ఉపయోగించి నిధులు సేకరిస్తున్నాయని విమర్శించారు.

**వీహెచ్‌పీది రాజకీయ ప్రేరేపిత లేఖ : ఆప్**

రామ మందిరంలో విరాళాల చోరీ గురించి ప్రతిపక్షాలు చేసే ఆరోపణలను కూడా పరిశీలించాలని విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అయోధ్య పోలీసులకు లేఖ రాయడంపై ఆప్ స్పందించింది. ఈ లేఖను రాజకీయ ప్రేరేపితమైనదిగా అభివర్ణించింది. శ్రీరాముడికి సంబంధించిన విషయాల్లో కూడా వివక్ష ఎందుకు? అని ప్రశ్నించింది. ఈ మేరకు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు.

**బీజేపీపై ఉద్ధవ్ ఫైర్**

అయోధ్య రామ మందిరంలో విరాళాల దుర్వినియోగంపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఆదివారం 'రామ రక్ష' ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అధికార బీజేపీయే లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. దోపిడీకి పాల్పడే హిందువులే అధికారంలో ఉన్నారని కాషాయపార్టీని ఉద్దేశించి ఆరోపించారు. రామాలయ విరాళాల చోరీపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హిందుత్వను దుర్వినియోగం చేసి ఎవరైనా ఆలయాన్ని దోచుకుంటే, హిందువులు వారిని వదిలిపెట్టరని హెచ్చరించారు. "దోపిడీకి పాల్పడే హిందువులు దేశంలో అధికారంలో ఉండటం దురదృష్టకరం. ఒక దొంగను తన దోపిడీ గురించి విచారణ జరపమని అడగలేం. అయోధ్యలో విరాళాల చోరీ ట్రైలర్ మాత్రమే. కాశీ, మధుర ఇంకా చాలా మిగిలే ఉన్నాయి. కాశీ, మధురలో ఏం జరుగుతుందోనని నేను ఆందోళన చెందుతున్నాను. మేము ధైర్యవంతులం. దేశాన్ని ప్రేమించే హిందువులం, కానీ మూర్ఖులం కాదు" అని ఉద్ధవ్ పేర్కొన్నారు.

# అయోధ్య రామమందిర విరాళాల కేసులో దోషులకు కఠిన శిక్ష పడాలి

అయోధ్య రామ మందిర విరాశాల అవకతవకలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్? (ఆర్ఎస్ఎస్) అధినేత ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన తీవ్రంగా ఖండించదగినదని, దోషులను కఠినంగా శిక్షించాలని ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే చేసిన ప్రకటననే ఆయన బలపరిచారు. ఇంతకు మించి అదనపు వ్యాఖ్యలు చేయడానికి ఆయన నిరాకరించారు. 'సన్మార్గ్? మైండ్ వెల్నెస్?' ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడిన ఆయన, ఒక రోజు క్రితం ఆర్ఎస్ఎస్ విడుదల చేసిన అధికారిక ప్రకటనను చూడాలని కోరారు.

శుక్రవారం హోసబలే మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "తరాల పోరాటాలు, కోట్ల మంది రామభక్తుల అంకిత భావం, త్యాగం, బలిదానాల వల్ల శ్రీరామ జన్మభూమిపై నిర్మించిన ఈ అద్భుత ఆలయం యావత్ హిందూ సమాజానికి భక్తి, శ్రద్ధ, విశ్వాసాలకు కేంద్రంగా మారింది. అయితే ఈ ఆయోధ్య రామమందిరంలో ఉంచిన విరాళాల దొంగతనం ఒక దురదృష్టకర ఘటన. ఇది మొత్తం సమాజం, రామభక్తుల మనోభావాలను, భక్తిని గాయపరిచింది. మనందరినీ ఎంతగానో గాయపరిచింది. ఇది తీవ్రంగా ఖండించదగినది. కనుక దర్యాప్తులో దోషులుగా తేలిన ఎవరికైనా కఠినమైన శిక్ష పడేలా చూడడం అత్యవసరం" అని అన్నారు. మరోవైపు అయోధ్య రామ మందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణల కేసు రాజకీయంగా మరింత వేడెక్కుతోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ తాజాగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. మరోవైపు విశ్వ హిందూ పరిషత్ (ఎవూ) ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలపైనా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. దీంతో ఈ కేసు రాజకీయంగా కొత్త మలుపు తిరిగింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆదివారం రోజు మీడియాతో మాట్లాడుతూ బీజేపీపై విరుచుకుపడ్డారు. బీజేపీ రాజకీయ వ్యూహం ఇప్పుడు 'ఓటు చోరీ, సీటు చోరీ, చందా చోరీ' గా మారిందని విమర్శించారు. అయోధ్య రామ మందిరం కోసం భక్తులు సమర్పించిన వేల కోట్ల రూపాయల విరాళాల్లో భారీ



స్థాయిలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటివరకు స్పందించకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు.

రామ మందిరం నిర్మాణానికి రాజకీయంగా క్రెడిట్ తీసుకున్న నాయకులు ఇప్పుడు ఈ ఆరోపణలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ' రామ మందిరం నిర్మాణం, అలాగే 2024 జనవరి 22న రామ మందిరం ప్రారంభోత్సవ ఘనతను తమ ఖాతాలో వేసుకున్న ప్రధాన మంత్రి- ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్యను కోల్పోయినప్పటికీ- దీనిపై ఏదైనా ప్రకటన చేస్తారని మేం ఆశిస్తున్నాం. కానీ వారు పూర్తిగా మౌనంగానే ఉన్నారు.' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఈ కేసును సిట్టింగ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ 'చందా దో.. ధందా లో' అనే విధానమే బీజేపీ రాజకీయ సంస్కృతిలో భాగమని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని సుప్రీం కోర్టు రద్దు చేసిందని, విరాళాల రాజకీయాలు బీజేపీ డీఎన్ఏలో భాగమని ఆయన ఆరోపించారు.

**'ప్రతిపక్ష నేతల్నీ విచారించాలి- ఆధారాలు లేకుంటే'**

ఇక ఇదే సమయంలో విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ మరో కీలక డిమాండ్ చేశారు. రామ మందిరం విరాళాల దుర్వినియోగం కేసుపై బహిరంగంగా ఆరోపణలు చేసిన ప్రతిపక్ష నేతల్ని కూడా దర్యాప్తు అధికారులు విచారించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, సమాజ్ వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ యాదవ్ చేసిన వ్యాఖ్యల నిజానిజాల్ని పరిశీలించాలని సూచించారు. ఈ నేతలు తమ ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పిస్తే వాటిని దర్యాప్తులో భాగంగా పరిగణించాలని, ఆధారాలు లేకుండా ప్రజల్ని తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేసి ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని అలోక్ కుమార్ తన లేఖలో పేర్కొన్నారు.

**అన్ని కోణాల్లో సిట్ విచారణ**

ఈ కేసులో యూపీ సర్కార్ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను కొనసాగిస్తోంది. సిట్ ప్రాథమిక నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఆరుగురి వద్ద నుంచి సుమారు రూ. 80 లక్షల వరకు నగదు, కొంత విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామాలు చేశారు. కేసుపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు మహంత్ దినేంద్ర దాస్ మహారాజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి దోషులెవరైనా కఠినంగా శిక్షించాలని అన్నారు. రామ మందిరం విరాళాల దుర్వినియోగం అత్యంత తీవ్రమైన నేరమని పేర్కొన్న ఆయన, ఆలయంలో పూజా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతున్నాయన్నారు. విరాళాల నిర్వహణలో పారదర్శకతను మరింత బలోపేతం చేశామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, రాజకీయ ఆరోపణలు- ప్రత్యారోపణలు మరింత వేడెక్కుతున్నాయి.

# భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం

ముంబయిని భారీ వర్షాలు, ఈదురుగాలులు అతలాకుతలం చేస్తున్నాయి. దీనితో ఆదివారం ఇండిగోకు చెందిన నాలుగు విమానాలు రద్దు కాగా, వివిధ సంస్థలకు చెందిన 13 ల్యాండింగ్ విమానాలను సమీపంలోని విమానాశ్రయాలకు దారి మళ్లించామని, అవి సురక్షితంగా ముంబయిలోనే ల్యాండ్? అయ్యాయని అధికారిక వర్గాలు తెలిపాయి. భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన 90 శాతం విమానాలు గంటకు పైగా ఆలస్యంగా నడుస్తున్నాయి. రావాల్సిన విమానాల్లో 45 శాతం ఆలస్యంగా నడుస్తున్నాయి. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదానీ గ్రూప్?, ఎయిర్?పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సంయుక్తంగా ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు ఎయిర్‌పోర్టు అధికారులు ఇవాళ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఉదయం సుమారు 10.17 గంటల సమయంలో గంటకు 42 నాట్స్ వేగంతో వీచిన బలమైన గాలులు, భారీ వర్షం కారణంగా విజిబిలిటీ తగ్గింది. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రన్?వే కార్యకలాపాలు ప్రభావం చూపాయి. నియమ, నిబంధనల ప్రకారం, ప్రయాణికులు, విమానాలు, గ్రౌండ్ సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకొని రన్?వే కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశాం" అని తెలిపింది. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత, ఒక గంట వ్యవధిలోనే రన్?వేపై సాధారణ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమైనట్లు వారు తెలిపారు. రద్దు అయిన నాలుగు ఇండిగో విమానాల్లో 6ఈ 395 (దిల్లీ-ముంబయి), 6ఈ 5273 (ముంబయి-ఇండోర్), 6ఈ 552 (ఇండోర్-ముంబయి), 6ఈ 6613 (ముంబయి-దిల్లీ) ఉన్నట్లు సమాచారం. ఎయిర్? ట్రాఫిక్ కంట్రోల్? (ఏటీసీ) వర్గాల సమాచారం ప్రకారం, ఈ విమానాశ్రయం రోజుకు 980 [illegible]చి 1000 విమానాల రాకపోకలను నిర్వహిస్తుంది. ఇక్కడ గంటకు సగటున 48 విమానాల రాకపోకలు జరుగుతుంటాయి.

**అంబానీ కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం**

ప్రముఖ వ్యాపారవేత్త ముకేశ్ అంబానీ కాన్వాయ్?కు ఆదివారం పెను ప్రమాదం తప్పింది. పశ్చిమ శివారులోని బంద్రా ప్రాంతంలో ఒక భారీ చెట్టు అంబానీ కాన్వాయ్ ముందే కూలిపోయింది. దీనితో అందులోని వారికి పెను ప్రమాదం తప్పింది. చెట్టు కూలడంతో కాసేపు ట్రాఫిక్? జామ్ ఏర్పడింది. అయితే అధికారులు సదరు చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసింది. కుర్లాలోని కమాని ప్రాంతంలోని నవపాడలో ఒక చెట్టు కూలడంతో 63 ఏళ్ల యూనస్ కుందవాలా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నవపాడలోని బీఎంసీ పాఠశాల సమీపంలోని గోమ్స్ గౌన్ బిల్డింగ్ ఏరియాలో ఈ ప్రమాదం జరిగింది.

## హార్ముజ్‌లో ప్రయాణించే నౌకలకు రుసుం.. మిత్రదేశాలకు ఇరాన్ రాయితీ!



ప్రపంచ ఇంధన వాణిజ్యంలో అత్యంత కీలకమైన హార్మ్యూజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై సేవా రుసుములు వసూలు చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో కుదుర్చుకున్న 60 రోజుల ఉచిత ప్రయాణ ఒప్పందం ముగిసిన తర్వాత ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. అయితే, కష్టకాలంలో తమకు మద్దతుగా నిలిచిన స్నేహపూర్వక దేశాలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని తెలిపింది. చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దోల్‌రెజా రహ్మానీ ఫజ్లీ శనివారం బీజింగ్‌లో జరిగిన వరల్డ్ పీస్ ఫోరంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ రుసుములను టోల్ ఫీజుగా పరిగణించరాదని, నౌకల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి సేవలు అందించినందుకు మాత్రమే వసూలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ కొత్త ఏర్పాట్ల కోసం ఒమన్‌తో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. "హార్మ్యూజ్ మా ప్రాదేశిక జలాల్లో భాగం కాబట్టి, మేము కచ్చితంగా సేవా రుసుములను వసూలు చేస్తాం" అని ఆయన అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన యుద్ధం తర్వాత ఇరు దేశాల మధ్య సయోధ్య కుదిరింది. ఇందులో భాగంగా 60 రోజుల పాటు హార్మ్యూజ్ జలసంధిలో నౌకల ఉచిత ప్రయాణానికి జూన్ మధ్యలో ఒప్పందం కుదిరింది. అయితే, ఈ జలసంధిలో ఎలాంటి రుసుములను అంగీకరించబోమని, అంతర్జాతీయ నౌకాయానానికి స్వేచ్ఛగా అందుబాటులో ఉండాలని అమెరికా వాదిస్తోంది. యుద్ధ సమయంలో ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడి ధరలు పెరిగాయి. కాల్పుల విరమణ తర్వాత రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ఇరాన్ తాజా నిర్ణయం ప్రపంచ షిప్పింగ్ ఖర్చులు, చమురు ధరలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని అంతర్జాతీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

## ఎన్నికల బరిలోకి ప్రశాంత్ కిశోర్



ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. బీహార్‌లోని బంకిపుర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికలో ఆయన పోటీ చేయనున్నట్టు జన్ సురాజ్ పార్టీ (జేఎస్ పీ) చీఫ్ మనోజ్ భారతి ఆదివారం ప్రకటించారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానం నుంచి కిశోర్ బరిలో దిగుతుండటంతో ఆయన రాజకీయ అరంగేట్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గతంలో ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది. బంకిపుర్ స్థానంలో బీజేపీ దశాబ్దాలుగా వరుస విజయాలు సాధిస్తోంది. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ, పార్టీ పూర్తి విశ్వాసంతో, శక్తియుక్తులతో ఈ ఉపఎన్నికలో పోరాడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఈ విజయమే పునాది వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "గత నాలుగేళ్లుగా జన్ సురాజ్ నా జీవితంగా మారింది. బీహార్‌లో మార్పు లక్ష్యం నెరవేరే వరకు ఇదే నా ధ్యేయం. బంకిపుర్ ఉపఎన్నికలో పోటీ చేసే బాధ్యతను ఆ లక్ష్యం దిశగా ఒక అడుగుగా భావిస్తున్నాను" అని కిశోర్ తెలిపారు. తనపై నమ్మకముంచిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బంకిపుర్ ఉపఎన్నికకు జులై 30న పోలింగ్ జరగనుండగా, ఆగస్టు 3న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల్లో కిశోర్‌కు మద్దతిస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. అయితే, బీజేపీ కంచుకోటను బద్దలుకొట్టే ప్రయత్నంలో రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) కూడా పీకేకు మద్దతు ఇస్తుందా లేదా అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

## గ్యాస్ సరఫరాపై అత్యవసర ఆంక్షలు ఎత్తివేత




సహజవాయువు సరఫరాపై విధించిన అత్యవసర ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. పశ్చిమాసియా నుంచి హార్మ్యూజ్ జలసంధి ద్వారా ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జీ) రవాణా తిరిగి సాధారణ స్థితికి చేరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. ఈ మేరకు 'నేచురల్ గ్యాస్ (సరఫరా నియంత్రణ) ఆర్డర్, 2026'ను సవరించినట్లు తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా హార్మ్యూజ్ జలసంధి మార్గంలో ఎల్ఎన్‌జీ నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సరఫరా సంస్థలు 'ఫోర్స్ మేజర్' ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది మార్చి 9న కేంద్రం అత్యవసర నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దేశీయ గ్యాస్, దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీని గృహ అవసరాల (పీఎన్‌జీ), రవాణా రంగం (సీఎన్‌జీ), ఎల్పీజీ ఉత్పత్తి, ఎరువుల కర్మాగారాల వంటి కీలక రంగాలకు మాత్రమే కేటాయించింది. పెట్రోకెమికల్స్, విద్యుత్ ప్లాంట్ల వంటి ప్రాధాన్యత లేని రంగాలకు సరఫరాలో కోతలు విధించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో కాల్పుల విరమణ అమలు, శాంతి చర్చలు జరుగుతుండటంతో పరిస్థితులు చక్కబడ్డాయని, సముద్ర మార్గంలో రవాణా సాధారణ స్థితికి చేరుకుందని మంత్రిత్వ శాఖ వివరించింది. అందుకే, అత్యవసర చర్యలు ఇక అవసరం లేదని పేర్కొంది. సంక్షోభ సమయంలో విధించిన మూడు అత్యవసర నిబంధనల్లో ఇది చివరిది. ఇప్పటికే రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని పెంచాలన్న ఆదేశాలను, బల్క్ డీజిల్ అమ్మకాలపై ఆంక్షలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. తాజా నిర్ణయంతో పరిశ్రమలు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, ఇతర వినియోగదారులపై ఒత్తిడి తగ్గనుంది. ఇకపై గ్యాస్ కేటాయింపులు సాధారణ వాణిజ్య ఒప్పందాల ప్రకారం కొనసాగుతాయి.

# చకచకా నిర్మాణ పనులు

ప్రస్తుతం సుదూర ప్రాంతాల నుంచి హైదరాబాద్? మహా నగర శివార్లను చేరుకోవడం ఒక ఎత్తయితే, అక్కడి నుంచి ప్రధాన ప్రాంతాలకు వెళ్లేందుకు ట్రాఫిక్ కారణంగా మరింత క్లిష్టంగా ఉంటోంది. ఇక ఉదయం, సాయంత్రం పీక్? అవర్స్??లో ఐదారు కిలోమీటర్లకు గంట నుంచి గంటన్నర వరకు ట్రాఫిక్?లో నిరీక్షించాల్సిందే. కొద్ది రోజుల్లో ఈ కష్టాలు తగ్గడంతో పాటు తెలంగాణలోని ఉత్తర జిల్లా ప్రాంతాలకు ప్రయాణం కూడా వేగవంతం కానుంది. దీనికోసం సర్కారు చేపట్టిన రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు మొదలై, చకచకా సాగుతున్నాయి.



### క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

ప్రస్తుతం ఉత్తర జిల్లాల నుంచి హైదరాబాద్ శివార్ల వరకు సాఫీగా ప్రయాణిస్తున్నా, అక్కడి నుంచి శామీర్?పేట, హకీంపేట మీదుగా సికింద్రాబాద్? వెళ్లే ప్రయాణికులు పీక్? అవర్?లో ట్రాఫిక్ వల్ల నరకం చూస్తున్నారు. ఈ రెండు కారిడార్ల నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్? సమస్యలు తీరనున్నాయి. వీటికి సంబంధించిన పనులు ఇటీవల ప్రారంభం కాగా, హెచ్?ఎండీఏ కమిషనర్? సర్ఫరాజ్? ఆదేశాల మేరకు అధికారుల బృందం మీడియాతో కలిసి పనులను పరిశీలించింది.

### సుమారు 45 నిమిషాల సమయం ఆదా

హెచ్ఎండీఏ అధికారులు ఆయా ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్షించారు. నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయాలంటూ ఆదేశించారు. ఈ రెండు కారిడార్లను పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకొస్తే దాదాపు 45 నిమిషాల నుంచి గంట పట్టే ప్రయాణ సమయం, 10 నుంచి 15 నిమిషాలకు తగ్గనుంది. శామీర్?పేట చుట్టపక్కల ప్రాంతాలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఈ ప్రాజెక్టులు శామీర్‌పేట్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ ప్రాంతాలకు గేమ్ ఛేంజర్లుగా నిలుస్తాయని అధికారులు చెబుతున్నారు. 600 మీటర్ల సొరంగ మార్గం : ఓ కారిడార్? నిర్మాణాన్ని రద్దీగా ఉండే ప్యారడైజ్? జంక్షన్?ను మొదలుకొని బాలంరాయ్ జంక్షన్?, రాజీవ్?గాంధీ విగ్రహ కూడలి, బేగంపేట రన్?వే ఏరియా, బోయిన?పల్లి చెక్?పోస్టు, డెయిరీఫాం దాకా మొత్తం 5.3 కి.మీ చేపట్టారు. ఇందులో 4.6 కి.మీ వరకు ఎలివేటెడ్ కారిడార్, బేగంపేట ఎయిర్?పోర్టు రన్?వే, విమానాల రాకపోకలకు అంతరాయం కలగకుండా 600 మీటర్ల మేర అండర్? టన్నెల్ మార్గం కూడా ఉంది. సొరంగ మార్గానికి సంబంధించి ప్రస్తుతం శరవేగంగా పిల్లర్ల నిర్మాణం సాగుతోంది. ఇప్పటికే 20 పిల్లర్లు, 6 వయోడక్ట్?ల పనులు జరుగుతున్నాయి. బేగంపేట ఎయిర్?పోర్టు దగ్గర భూగర్భ సొరంగ మార్గం పనులు చేపట్టేందుకు బాలంరాయ్? దగ్గర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులన్నీ రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఈ కారిడార్ కోసం భూసేకరణ సహా మొత్తం రూ.1,487 కోట్లు ఖర్చు చేస్తోంది.

### 1.3 కి.మీల ఓపెన్ అండర్ పాస్ నిర్మాణం

ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట వరకు 18.14 కి.మీ.ల మేర మరో ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించిన పనులు త్వరలో ఊపందుకోనున్నాయి. దీనిని తిరుమలగిరి, అల్వాల్, హకీంపేట మీదుగా శామీర్‌పేట వద్ద ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానిస్తారు. ఇందులో 1.3 కి.మీ.ల ఓపెన్ అండర్‌పాస్ రానుంది. ఇది టివోలీ జంక్షన్, జనరల్ చౌదరి రోడ్డు, సికింద్రాబాద్ క్లబ్ జంక్షన్, విక్రంపురి వరకు కొనసాగుతుంది.

### హకీంపేట దగ్గరా ఓ అండర్ టన్నెల్

అండర్‌పాస్‌కు రెండు వైపులా రెండు లేన్ల సర్వీసు రోడ్లు రానున్నాయి. ఈ అండర్?పాస్? రోడ్డు ముగిసిన దగ్గర నుంచి మళ్లీ ఫ్లైఓవర్? ప్రారంభం కానుంది. హకీంపేట విమానాశ్రయం వద్ద కూడా 400 మీటర్ల సొరంగ మార్గం, తూంకుంట దగ్గర వెహిక్యులర్ అండర్?పాస్ (వీయూపీ)ని నిర్మించనున్నారు. ఈ కారిడార్?ను కూడా రెండు సంవత్సరాల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు అంటున్నారు. రూ.4,263 కోట్లు వెచ్చించి ఈ కారిడార్?ను నిర్మించనున్నారు.

# కేసీఆర్‌పై కక్షతోనే రైతులకు గోస

**కాళేశ్వరం పంప్‌హౌస్‌లు ప్రారంభించకపోతే కన్నెపల్లి ముట్టడి**
**60 వేల మంది రైతులతో గేట్లు తెరుస్తాం..**
**ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అల్టిమేటం**
**కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శన..ప్రభుత్వ తీరుపై ఆగ్రహం**



**వరంగల్:** కేసీఆర్‌పై రాజకీయ కక్షతో తెలంగాణ రైతులను ఈ ప్రభుత్వం గోస పెడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. తెలంగాణకు వరప్రదాయిని లాంటి కాళేశ్వరం ప్రాజెక్టుకు సీఎం రేవంత్‌రెడ్డి శనిలా దాపురించారని ధ్వజమెత్తారు. ఓ వైపు ఎల్‌నినోతో 26 జిల్లాల్లో కరువు పరిస్థితులు నెలకొంటే.. మరోవైపు 98 వేల క్యూసెక్కుల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తుంటే ముఖ్యమంత్రి సిగ్గులేకుండా.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పంప్‌హౌస్‌లు ప్రారంభించకపోతే 60 వేల మంది రైతులతో కన్నెపల్లి పంప్‌హౌస్ ముట్టడించి గేట్లు తెరుస్తామని హెచ్చరించారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి పంప్‌హౌస్‌ను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

### కాళేశ్వరం రైతుల ఆత్మహత్యలు ఆపింది..

'రైతుల ప్రయోజనాలను పక్కనబెట్టి కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశంతోనే కన్నెపల్లి పంప్‌హౌస్‌లను నిలిపివేశారు. మేడిగడ్డ బరాజ్ అవసరం లేకుండానే కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి మేలు జరిగింది. రైతు ఆత్మహత్యలను ఆపింది. భూముల విలువ, తెలంగాణ రైతు విలువ పెంచింది. కానీ ముఖ్యమంత్రి దు?రప్పచారం చేస్తున్నారు. ప్రాజెక్టు రూ.94 వేల కోట్లు అయితే, రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందంటూ స్వయానా ముఖ్యమంత్రి మామే అన్నారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డైలాగులు చెప్పారు. 2014 కంటే ముందు మీరే ఉన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. 2014 కంటే ముందు రికార్డు స్థాయిలో పంటలు ఎందుకు పండలేదు? ఉత్తమ్‌కుమార్.. మీ శ్రీమతి ప్రాతినిథ్యం వహిస్తున్న కోదాడ నియోజకవర్గంలో కాకతీయ కెనాల్‌లో ఎప్పుడైనా నీళ్లు ఉన్నాయా?..' అని కేటీఆర్ ప్రశ్నించారు.

### నీళ్లిస్తే యూరియా ఇవ్వాల్సి వస్తుందనే..

'కాళేశ్వరం ద్వారా ఇప్పుడు నీళ్లిస్తే యూరియా ఇవ్వాలన్న భయంతోనే రేవంత్ ఇలా చేస్తున్నారు. అంతేకాదు నీళ్లిస్తే పంటలు పండుతాయి. పంట పండితే బోనస్ అడుగుతారు. ఆ పంట మళ్ళీ కొనాలి. కాబట్టే నీళ్లు ఇవ్వడం లేదు. బీఆర్ఎస్‌ను బద్నాం చేయాలనే లక్ష్యంతోనే ముందుకు వెళు న్నారు. కాళేశ్వరం రాష్ట్రానికి కేసీఆర్ ఇచ్చిన ఒక అద్భుత వరం. రాష్ట్రానికి పట్టిన శని రేవంత్‌రెడ్డి అని జగిత్యాల సభలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చెప్పారు. ఒక వారం పాటు కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు అప్పజెప్పండి. మొత్తం తెలంగాణ నిండా నీటిని పారించే బాధ్యత మాది. కన్నెపల్లి నుంచి రోజుకు దాదాపు రెండు టీఎంసీలు ఎత్తిపోయొచ్చు. ట్యాంక్‌బండ్ కెపాసిటీ ఒక టీఎంసీ, హుస్సేన్‌సాగర్ కెపాసిటీ ఒక టీఎంసీ. రెండు హుస్సేన్‌సాగర్‌లను లిఫ్ట్ చేసే కెపాసిటీ కాళేశ్వరం మోటార్లకు ఉంది..' అని కేటీఆర్ చెప్పారు.

### పోలీసుల తీరుపై ఆగ్రహం

'హైదరాబాద్ నుంచి కన్నెపల్లికి నాలుగు గంటల్లో చేరాల్సిన మా బృందం, పోలీసులు విధించిన ఆంక్షల కారణంగా ఏడు గంటలు ప్రయాణించాల్సి వచ్చింది. పెంబర్తి, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్ తదితర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి అడుగడుగునా అడ్డుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్టు చేశారు..' అని కేటీఆర్ మండిపడ్డారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీలు మలోత్ కవిత, వినోద్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, విద్యాసాగర్‌రావు, జీవన్‌రెడ్డి, రాజయ్య, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, సుంకె రవిశంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఏనుగుల రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పలు ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు

**హైదరాబాద్:** జూలై నెల 5వ తేదీ వచ్చినా పలు ప్రభుత్వ విభాగాల్లోని మెజారిటీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇంకా వేతనాలు అందలేదు. ఈ నెల ఒకటో తేదీన కొన్ని ప్రభుత్వ శాఖల్లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించినప్పటికీ.. చాలా విభాగాల్లో మాత్రం వేతనాలు అందలేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన చెల్లింపులకు సంబంధించిన బిల్లులు రూపొందించకపోవడం, వాటిని సకాలంలో సంబంధిత ట్రెజరీ కార్యాలయాలు, పే అండ్ అకౌంట్స్ విభాగాలకు సమర్పించకపోవడంతో వేతన చెల్లింపులు నిలిచిపోయాయి.

### పలు శాఖల ఉద్యోగులకు నిరాశ

రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ప్రాతిపదికన దాదాపు 5 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కొన్ని ప్రభుత్వ విభాగాల్లో కొన్నేళ్లుగా ప్రతి నెలా 5వ తేదీ నుంచి 20వ తేదీ మధ్య వేతన చెల్లింపులు జరుగుతున్నాయి. కొన్ని విభాగాల్లో నెలల తరబడి వేతన చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. దీనివల్ల ఉద్యోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో.. ఈ అంశాన్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాయి. దీంతో ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి.. ఇకపై అందరికీ ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. కానీ ఫలితం లేకుండా పోయింది. పలు ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నిరాశ తప్పలేదు. దాదాపు సగం మంది ఉద్యోగులకు 4వ తేదీ సాయంత్రం వరకు వేతనాలు అందలేదని అంచనా. పంచాయతీరాజ్ శాఖ, తెలంగాణ మోడల్ స్కూల్స్, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, కాకతీయ మెడికల్ కాలేజీ, వరంగల్ ఈఎస్ఐ డిస్పెన్సరీ, అటవీ శాఖ, లైబ్రరీ శాఖ, మైనింగ్ శాఖ, ఎస్ఆర్ఆర్ఎస్ గవర్నమెంట్



పాలిటెక్నిక్ కళాశాల, సాంకేతిక విద్యాశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, బీసీ గురుకులాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, పలు మున్సిపాలిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, విజయా డెయిరీ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు, పోలీస్ శాఖ, భూగర్భ జలవనరుల శాఖ, జలమండలి బిల్ కలెక్టర్లు, అన్ని జిల్లా కలెక్టరేట్లలో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్ సిబ్బంది, చెక్ పేమెంట్ విధానంలో పనిచేస్తున్నవారు, 104 డ్రైవర్లు, ఆపరేటర్లు, పశుసంవర్ధక శాఖ, ఈఎస్ఐ నాచారం, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు శనివారం సాయంత్రం వరకు వేతనాలు అందలేదు.

## వర్షాకాల వ్యాధుల నివారణకు సీఎంసీ సరికొత్త పద్ధతి



-మొదటిపేజీ తరువాయి

చేపడుతుంది. సీఎంసీ కమిషనర్ పర్యవేక్షణలో ఈ యూనిట్ కార్యకలాపాలు సాగనున్నాయి. నోడల్ ఆఫీసర్‌గా అడిషనల్ కమిషనర్ వ్యవహరిస్తారు. రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులు ఉంటారు.

### నాలుగు అంచెల్లో ప్రణాళికలు అమలు

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడినుంచైనా వ్యాధుల వ్యాప్తి గురించి సమాచారం అందినా వెంటనే స్పందించడానికి ఈ యూనిట్‌ను నాలుగు అంచెల్లో అమల్లో చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఆసుపత్రులు, ప్రజల నుంచి వ్యాధుల వ్యాప్తికి సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం సేకరించడానికి నిరంతర కంట్రోల్ రూమ్‌తో పాటు హెల్ప్‌లైన్ పని చేస్తుంది. పరిణామాలను మున్సిపల్, వైద్య బృందాలు వెంటనే కంట్రోల్? రూమ్?కు తెలియజేస్తాయి. అందిన సమాచారాన్ని ఉన్నతాధికారుల బృందం ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. వ్యాధి వ్యాప్తి ద్వారా ముప్పు వాటిల్లే అవకాశముందని తేలితే ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్ఆర్‌టీ)లు వెంటనే రంగంలోకి దిగి నివారణ చర్యలు చేపడతాయి. ఎంఎస్‌యూ ఐదు ప్రధాన సూత్రాల కార్యాచరణ ద్వారా తన బాధ్యతలను నిర్వర్తించాలని భావించింది. ఆధునిక సాంకేతికత సాయంతో అంటు వ్యాధుల వ్యాప్తిని నిరంతరం ట్రాక్ చేసి, మహమ్మారిగా వ్యాప్తి చెందక ముందే గుర్తించడం. క్షేత్రస్థాయి ద్వారా అందిన ఆరోగ్య సమాచారాన్ని క్రోడీకరించి, తగిన ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేయడం. అత్యంత ప్రమాదం పొంచి ఉన్నట్లు భావించే ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు చేయడం. నివారణ చర్యలను వేగవంతం చేయడానికి వైద్య, మున్సిపల్ విభాగాల క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి పనిచేయడం. ప్రజలను వ్యాధి నుంచి అప్రమత్తంగా ఉంచడానికి నిరంతరం తగు హెచ్చరికలు జారీ చేయడం. సీజనల్ వ్యాధులపై సీఎంసీ ప్రత్యేక నిఘా : వర్షాకాలంలో ప్రజలను ఎక్కువగా వేధించే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, లెప్టోస్పిరోసిస్ ఇతర నీటి ద్వారా వ్యాపించే వ్యాధులపై ఎంఎస్‌యూ ప్రధానంగా ప్రత్యేక నిఘా ఉంచనుంది. దోమల నివారణ, సీజనల్ వ్యాధుల సమాచారం ఇవ్వడానికి ప్రజలు 0402111 1111 అనే హెల్ప్‌లైన్ నంబరును సంప్రదించవచ్చు. ఈ కొత్త యూనిట్ ఏర్పాటుతో వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తి నియంత్రణలో సీఎంసీ సమర్థవంతంగా వ్యవహరించే అవకాశముంది. ప్రజలు కూడా సహకరిస్తే ఈ ప్రయత్నం మరింత సఫలం అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### వైరల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉండాలంటే

వాతావరణంలో మార్పుల వల్ల దగ్గు, జలుబు వంటి సీజనల్ సమస్యలు రావడం సహజం. అయితే, శ్వాసకోస వ్యాధులతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు చెబుతున్నారు. శుద్ధి చేసిన నీరు లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. రోగనిరోధక శక్తిని పెంచే 'సి' విటమిన్ అధికంగా ఉండే పండ్లు, డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని చెబుతున్నారు. ముఖ్యంగా దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. వాంతులు, జ్వరం, విరేచనాలు అవుతున్నాయంటే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

## రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయి

-మొదటిపేజీ తరువాయి

పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే పలుమార్లు లేఖలు రాశారు. తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొద్దిరోజుల క్రితమే దిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో రైలు విస్తరణను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనికి కేంద్రం సహాయం అవసరమని సీఎం వివరించినట్టు సమాచారం. మెట్రో విస్తరణకు నోచుకోకపోవడంతో హైదరాబాద్‌లో నగరంలో ఎదురవుతున్న ఇబ్బందులను కేంద్రమంత్రి దృష్టికి రేవంత్ తీసుకెళ్లారు. విస్తరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పిన సీఎం, దీనికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రావాల్సిన రుణాన్ని త్వరగా విడుదలయ్యేలా చొరవ చూపాలని కోరారు. భేటీ సందర్భంగా ఈ ప్రాజెక్టు చుట్టూ ఏర్పడిన రాజకీయ అంశాలు సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మెట్రో రెండో దశ అనుమతులపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించిన పలు అంశాలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. అయితే మెట్రో అంశం రైల్వే శాఖ పరిధిలోనిది కానందున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో తాను మాట్లాడతానని హామీ ఇవ్వడంతో పాటు వెంటనే ఆ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

## రైతుల్లో ఎల్‌నినో టెన్షన్

-మొదటిపేజీ తరువాయి

పోయకపోయినా, దుక్కులు దున్ని పొలాల కోసం సిద్ధం చేసుకునే రైతులు ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ముందుగానే నార్లు పోసి వర్షాలు లేకపోతే మొత్తం పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉండటంతో చాలామంది రైతులు రిస్క్ తీసుకోవడం లేదు. కాలం ఎత్తిపోతే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి పెట్టే యోచనతో ఉన్నారు.

వరి 1.94 లక్షల ఎకరాల్లోనే..

రాష్ట్రంలో ఈ ఖరీఫ్‌లో 132 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో వరి 62.47 లక్షల ఎకరాల్లో సాగు కావలసి ఉండగా, ఇప్పటివరకు 1.93 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు కాగా.. గత ఏడాది ఇదే సమయానికి 5 లక్షల ఎకరాల్లో సాగైంది. వరి ఇప్పటివరకు ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లోనే ఎక్కువగా సాగైనట్లు తెలుస్తోంది. ఈ ఖరీఫ్‌లో పత్తి 49 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 30 లక్షల ఎకరాల్లో సాగైంది. గత ఏడాది ఇదే సమయానికి 36,30,988 ఎకరాల్లో సాగైంది. వర్షాధారమైన పత్తికి ఎల్‌నినో దెబ్బ తగిలితే పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి, పత్తి పోగా మిగిలిన అక్కడక్కడా మొక్కజొన్న, సోయాబీన్, కంది తదితర పంటల సాగు కొనసాగుతోంది.

గోదావరి, ప్రాణహితపై ఆశలు

ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా ఇప్పటికే ప్రాణహిత నదిలోకి వరద వచ్చి చేరుతోంది. గోదావరికి కూడా ఇన్‌ఫ్లో పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల కింద ఉన్న రైతుల్లో కొంత మేర ఆశలు మొలకెత్తుతున్నాయి. ప్రాణహితకు వరద పెరిగితే ఆ ప్రభావం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని ప్రాజెక్టులకు ఉపయోగపడే అవకాశం ఉంది. కృష్ణా పరీవాహక ప్రాంత రైతులు ఈసారి వరిపై ఆశలు వదిలేసుకునే పరిస్థితిలో ఉన్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతాంగం దృష్టి ఇప్పుడు రాబోయే రెండు వారాలపైనే నిలిచింది. ఈ సమయంలో విస్తృతంగా వర్షాలు కురిస్తేనే వరి నాట్లు ఊపందుకునే అవకాశం ఉంది. లేకపోతే ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

## సంపాదకీయం

# ఫిరాయింపులు కొత్త బెంగాలీ కథ!

రాజకీయాలలో ఎంత దిగువకు దిగజారితే అథఃపాతాళానికి చేరుకున్నట్టు? ఇది రాజకీయ ప్రశ్న కాదు, సామాజికమే. రాజకీయ నాయకులు అవకాశవాదంతో పార్టీలు ఫిరాయించడానికి ఎప్పటికప్పుడు కొత్త దారులు కనిపెడుతున్నారు... యథేచ్ఛగా ఆ దారిన పరుగులు తీస్తున్నారు. ఈమధ్యే చోటుచేసుకున్న పశ్చిమ బెంగాల్ పరిణామాలు చూస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. దశాబ్దంన్నర పాటు ఏకచ్ఛత్రాధిపత్యం సాగించిన మమతా బెనర్జీని ప్రజలు ఇంటికి సాగనంపారు. ఇది ప్రజాస్వామ్యంలో సహజ పరిణామం. ఏదో ఒక్క రాజకీయ పక్షాన్నో, ఒకే ఒక్క రాజకీయ నేతనో ప్రజలు శాశ్వతంగా అధికారంలో ఉండనివ్వకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తి. కానీ ఒక పార్టీ అండతో గెలిచినవారు, ఒక్క ఉదుటున గీత దాటిపోతే... మరి వారి రాజకీయ విధేయత సంగతి ఏమిటి? రాజకీయ అధికారం, సామాజిక హోదా కల్పించిన మాతృసంస్థతో కలిసి నడవాలా, అక్కరలేదా? రాజకీయ నడతలో నైతికతకు స్థానం ఉండనక్కరలేదా? ఎన్నికలలో ప్రజలు ఒక పార్టీని ఇంటికి పంపగానే అప్పటివరకూ ఆ పార్టీలో ఉండి రాజకీయాలను నడిపించిన వ్యక్తులు ఒక్కసారిగా, మూకుమ్మడిగా కొత్త దారులు అన్వేషించడాన్ని సామాజిక పరిశోధకులు ఎలా నిర్వచిస్తారు? దీనిని అధినాగరిక లక్షణంగా పునర్నిర్వచించడానికి కొలమానం ఏమైనా ఉన్నదా? ఈ దేశంలో పార్టీ ఫిరాయింపు రాజకీయాలు కొత్తేమీ కాదు, కానీ అందుకు కూడా కొన్ని పద్ధతులను పాటించడం గతంలో చూశాం. ఇప్పుడు మార్గం మారింది.

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నాయకత్వంలో అప్రతిహతంగా ఏలుబడి సాగించిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ.. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజాగ్రహాన్ని చవిచూసింది. గతంలో ఆ పార్టీ టిక్కెట్టుపై గెలిచి సగర్వంగా పార్లమెంటు మెట్లు ఎక్కిన 20 మంది సభ్యులు రాత్రికి రాత్రి ఎన్సీపీఐ (నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా) అనే పార్టీలోకి వెళ్లిపోయారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది అసెంబ్లీ ఎన్నికలలో కదా..., కానీ ఇప్పుడు పార్టీ మారిన వారు అసెంబ్లీ సభ్యులు కారు, వారు పార్లమెంటు సభ్యులు. తృణమూల్ నాయకత్వంపై అసంతృప్తి ఉంటే, నాయకత్వంపై తిరుగుబాటు అవసరం అనుకుంటే గతంలో ఎప్పుడో ఈ పని చేసి ఉండవచ్చు. కానీ అలా చేయలేదు. సరే, పశ్చిమ బెంగాల్లో చక్రం తిప్పిన తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఎన్సీపీఐలోకి వెళ్లిన వారికి, పాత పార్టీలో కనిపించని ఉత్తేజపూరితమైన సైద్ధాంతిక బలం ఏమైనా కొత్త పార్టీలో కనిపించిందా అంటే అటువంటిదేమీ ఉన్నట్టు లేదు. అసలు ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ అంతటి రాష్ట్రాన్ని నడిపించినంతటి పెద్ద పార్టీ నుంచి మరో పార్టీలోకి వీరు వెళ్లారంటే అదింకా ఎంత పెద్ద పార్టీయో కదా అని అనిపిస్తుంది. కానీ ఆరా తీస్తే చాలా ఆశ్చర్యకరమైన సంగతులు తెలుస్తాయి. నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా అనే పార్టీకి పశ్చిమ బెంగాల్‌లో అసలు మూలాలే లేవు. ఆ పార్టీ వెనుక ప్రజలు లేరు, ఆ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి కార్యకర్తలు లేరు. కలకత్తాలో ఒక చిన్న ఆఫీసు మాత్రమే ఉందట. పోనీ గతంలో ఏమైనా పెద్ద రాజకీయ చరిత్ర ఉందా అంటే అదీ లేదు. ఇప్పుడు 20 మంది పార్లమెంటు సభ్యులను తనలోకి ఇముడ్చుకున్న ఆ బుజ్జి రాజకీయ పక్షానికి పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో సైతం ఎన్నడూ పోటీ చేసిన చరిత్ర లేదు. అప్పనంగా 20 మంది ఎంపీల రాక ఓ హఠాత్ పరిణామం. దాంతో అసలు ఎక్కడా ఏ రూపంలోనూ ప్రాతినిధ్యమే లేని ఓ చిన్న రాజకీయ పక్షం ఉన్నట్టుండి ఒక్కసారిగా పార్లమెంటులో ఒక పెద్ద పార్టీగా రాత్రికి రాత్రి అవతరించేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ మిత్రపక్షాలలో ఇప్పుడు అగ్రతాంబూలం ఈ బుజ్జి పార్టీదే. ఇంతా చేస్తే దీని వయస్సు ముచ్చటగా మూడేళ్లే. గతంలో ఈ పార్టీ తరఫున నలుగురు త్రిపుర అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేస్తే.. ఒక్కొక్కరికి వచ్చిన ఓట్లు నాలుగైదు వందలకు మించలేదు. అప్పట్లో ఆ పార్టీ నినాదం మాత్రం చాలా ఆకర్షణీయంగా ఉంది. 'మీ ఓట్లను కాపాడుకోవడానికి పార్టీ ఫిరాయింపుదారులను తిప్పికొట్టండి' అని ప్రజలకు సందేశం ఇచ్చిన నినాదం అది. ఎంత బాగుందీ నినాదం! ఆదర్శప్రాయమైన ఒక నినాదాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి ఆ పార్టీ నేతలు చేసిన కృషిని ఆ పార్టీకి వచ్చిన ఓట్ల సంఖ్యతో బేరీజు వేయనక్కరలేదు గానీ, జరిగిన పరిణామాలను బట్టి చూస్తే మాత్రం ఆ నినాదానికీ, తదుపరి పరిణామాలకూ ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఏడు కిరణాల మధ్య జిగేల్‌మని మెరుస్తున్న పాళీని ఎన్నికల గుర్తుగా ఎంచుకున్న ఈ పార్టీకి విరాళాలు కూడా వచ్చాయి. వచ్చిన లక్షా పదివేల డెబ్భై అయిదు రూపాయలలో ఖర్చులు పోగా, ఇంకా డెబ్భై అయిదు రూపాయలు బ్యాంకు ఖాతాలో నికరంగా మిగిలే ఉన్నాయి. బాగుంది. విరాళాల దుర్వినియోగం జరగనే లేదు. ఈ విశేషాలను బట్టి చూస్తే.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్సీపీఐలోకి వచ్చిన వారు ఆ పార్టీ నినాదం చూసి ఆకర్షితులై ఇందులోకి వచ్చారనుకోవడానికి ఇసుమంత ఆధారం కూడా కనిపించడం లేదు. మరి ఎందుకు మారినట్టు? పార్టీ ఫిరాయింపుదార్లుగా ముద్ర పడకూడదనే ఉద్దేశంతోనే, వారు మూకుమ్మడిగా పార్టీ మారారన్నది చెప్పకనే చెబుతున్నది. అంత అవసరం ఏమొచ్చిందీ అంటే... అసలు సిసలు తృణమూల్ కాంగ్రెస్ తమదేనని, కాబట్టి తమనే అసలైన తృణమూల్‌గా గుర్తించాలని ఈ 20 మందీ వెళ్లి ఎన్నికల కమిషన్‌ను అభ్యర్థించాలి. ఎన్నికల కమిషన్ అవునని అంగీకరించడానికి చాలా కసరత్తు చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా సమయం.

ఈ డిజిటల్ యుగంలో దీర్ఘకాలం ఎదురుచూసే సహనశీలురు అరుదు. అందుకే ఒక్క దెబ్బతో-- ఒక కొత్త వ్యూహంతో-- పాత మిత్రులతో కలిసి కాక, పార్లమెంటులో విడిగా ప్రత్యేకంగా కూర్చునే వీలును సాధించుకున్నారు. బాగు బాగు... మామూలుగా అయితే ఒక రాజకీయపక్షం మాత్రమే మరో పార్టీలో విలీనం కావచ్చు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆ కొత్త పార్టీలో తమ పాత పార్టీ విలీనం అయ్యింది కనుక తామూ అందుకు అంగీకరిస్తున్నట్టు చెప్పుకోవచ్చు. అప్పుడు ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు. కానీ ఇప్పుడు మూడింట రెండు వంతుల మంది మేము ఫలానా పార్టీలో చేరిపోయామని ప్రకటించుకోవడం వల్ల అనేక విధాలుగా అందరికీ శిరోభారం తగ్గినట్టే. మమతా బెనర్జీ ఆశ్రిత పక్షపాతానికి బందీ అయ్యుండవచ్చు, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఖాతరు చేయకపోయి ఉండవచ్చు, అవినీతిని అరికట్టలేకపోయి ఉండవచ్చు, ఆమె నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడానికి మరెన్నయినా కారణాలు ఉండవచ్చు. కానీ వాటిని వ్యతిరేకించేవారు ప్రాథమిక ప్రజాస్వామిక సూత్రాలనే ఆచరణలోకి తెచ్చి ఉండవచ్చు. కానీ అలా జరగకపోవడాన్ని సమాజం కూడా ఆక్షేపిస్తున్నట్టు లేదు. నాయకులలోని అప్రజాస్వామిక వర్తన చూస్తే సమాజానికి చీమ కుట్టినట్టయినా అనిపించడం లేదు. ఒకప్పుడు ఇటువంటి పరిణామాలు సంభవించినప్పుడు ప్రజలు ఈసడించుకునేవారు. చెట్టు కిందో, గట్టు మీదో కూర్చుని వార్తా పత్రికలు పట్టుకుని మరీ ఇందులోని మంచి-- చెడు గురించి చర్చోపచర్చలు చేసేవారు. ఎవరికి తోచిన పద్ధతిలో వారు ఇటువంటి పరిణామాల పట్ల ఏదో ఒక స్థాయిలో నిరసన ధ్వని వినిపించేవారు. ఇప్పుడు ఆ సంస్కృతి మాయమైపోయింది. ఇది కూడా ఆకస్మికంగా జరిగింది కాదు. ఇది మనకు మామూలే. ఆ రోజుల్లో చీటికీ మాటికీ పార్టీలు మారే వారిని ఉద్దేశించి ఆయారాం, గయారాం అనేవారు. హర్యానా శాసనసభ్యుడు గయా లాల్ కేవలం పదిహేను రోజులలో ముచ్చటగా మూడు పార్టీలు ఫిరాయించడంతో ఈ శకం ప్రారంభమైంది. అది ఒక రకమైన తిట్టు. అయితే దేశ రాజకీయాలలో శ్రీరామునికి ఉచితాసనం ఇవ్వడం మొదలయ్యాక ఆయారాం, గయారాం అనడానికి ఎవరైనా సంశయించవలసివస్తోంది. అంత తేలికగా నోరు పెగలడం లేదు. అలనాటి ఫిరాయింపు క్రీడలో భజన్‌లాల్ ఉదంతం మరీ విచిత్రం. హర్యానా మంత్రిమండలి మొత్తం ఏకబిగిన జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి దూకడం పెద్ద సంచలనం సృష్టించింది, పెనుదుమారం మిగిల్చింది. ఫిరాయింపు ప్రహసనం పుణ్యమా అని దేశంలో ఉన్నట్టుండి కుప్పకూలిన రాష్ట్ర ప్రభుత్వాల సంఖ్య 45 వరకూ ఉంటుందని విశ్లేషకులు తేల్చారు. భారత రాజకీయాలలో ఒకప్పుడు హెచ్.ఎన్ బహుగుణ అనే నాయకుడు ఉండేవారు. దేశం మొత్తం మీద ఎక్కువ సార్లు పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన రాజకీయ నాయకుడు ఎవరు అంటే.. మొట్టమొదట ఈ బహుగుణ పేరే వినవచ్చేది.

# వాట్సాప్ జానపదం

'తోడేలు వచ్చింది' అని అరిచిన కుర్రాడి కథ మనకు తెలుసు. ఆ అబద్ధం మొదటిసారి ఊరిని నవ్వించింది. రెండోసారి ఊరికి అలవాటు అయ్యింది. మూడోసారి నిజంగానే తోడేలు వచ్చినప్పుడు ఊరు నిద్రపోయింది. గొర్రెలు పోయాయి. కుర్రాడి మాటకు శాశ్వతంగా విలువ పోయింది. అది జానపదం మనకు నేర్పిన మొదటి పాఠం. అబద్ధానికి కాళ్లు ఉండవు. ఉన్నా ఎక్కువ దూరం నడవవు. కానీ, ఈరోజు ఆ కుర్రాడు మనలోని ప్రతిఒక్కరి జేబులో ఉన్నాడు. ప్రతి గ్రూపులో ఉన్నాడు. ప్రతి ఫార్వర్డ్‌లో ఉన్నాడు. వాట్సాప్ ఇప్పుడు కొత్త జానపద వేదిక అయింది. కానీ ఇక్కడున్నది అమ్మమ్మ చెప్పిన కమ్మని కథ కాదు. ఇది భయం కథ, ద్వేషం కథ, అనుమానం కథ. చదివిన వెంటనే గుండె కొట్టుకునేలా చేసి చివర్లో 'పదిమందికి పంపు' అని ఆజ్ఞాపించే బెదిరింపు కథ. ఇది జానపదం కాదు, అబద్ధాల జానపదం.



మనం సులభాన్ని ఎంచుకున్నాం. ఫలితంగా మన మెదడు అనే కండరం క్షీణించి పోతోంది. ఏది పడితే అది నమ్మే బలహీనమైన మనస్తత్వంగా కుంగిపోతోంది. అబద్ధాలతో భయపడేవాడు ప్రశ్నించడు. ప్రశ్నించనివాడు బానిస అవుతాడు. ఒకప్పటి జానపదం 'భయపడకు... చివరికి మంచే గెలుస్తుంది' అని ధైర్యం చెప్పేది. ఈ కొత్త జానపదం 'భయపడు... నువ్వు ఒంటరివి' అని విషం ఎక్కిస్తోంది. దీంతోపాటు డిజిటల్ ప్రపంచంలో గుర్తింపు కోసం ఆరాటపడే మానసిక పేదల బెడద ఒకటి. నిజజీవితంలో కనీసం మాట విననివాడు గ్రూపులో అడ్మిన్ కావాలని చూస్తున్నాడు. 'నేను అందరికంటే ముందు పంపాను' అనే చిన్న కామెంట్ కోసం ఆత్మను తాకట్టు పెడుతున్నాడు. ఇక్కడ సత్యం కంటే స్పందన (రియాక్షన్) ముఖ్యం అయింది. ఒక అబద్ధం పదివేల లైక్స్ తెస్తే ఒక నిజం పది లైక్స్‌కు కూడా నోచుకోవడం లేదు. మనం సంఖ్యలకు అలవాటు పడ్డాం. ఆత్మగౌరవాన్ని సోషల్ మీడియా మెట్రిక్స్‌కు అమ్మేశాం.

'అబద్ధాలకోరుకు శిక్ష ఏమిటంటే అతను నిజం చెప్పినా ఎవరూ నమ్మరు' అని ఆఫ్రికా సామెత. ఒకసారి నమ్మకం పోతే మళ్లీ తిరిగిరాదు. అదే పడాల్సిన శిక్ష. కానీ శిక్ష అక్కడితో ఆగడం లేదు. ఈ అబద్ధాల జానపదంలో నిత్యమునకలు వేసేవాడి మానసిక ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటోంది. మొదట అనుమానం... తర్వాత కోపం... ఆ తర్వాత వాస్తవానికి క్రమంగా దూరమవుతాడు. ఆపై డాక్టర్ చెప్పినా, సైన్ ?స నిరూపించినా 'వాట్సాప్‌లో వేరేగా ఉంది' అని వాదించే మొండితనం హెచ్చురిల్లుతుంది. రాత్రులు నిద్ర పట్టదు, ఎందుకంటే మెదడు ఎప్పుడూ అలర్ట్ మోడ్‌లోనే ఉంటుంది. ఆఖరిగా నైతికత మొద్దుబారుతుంది. 'అందరూ పంపుతున్నారు కదా' అనే సమాధానం లోపలి గిల్ట్‌ను చంపేస్తుంది. ఒకప్పటి జానపదం మనల్ని కలిపింది. ఒకే వెన్నెల్లో రాజు కొడుకు, రైతు కొడుకు కూర్చుని ఒకే కథ విన్నారు. ఒకే పాటకు కన్నీరు పెట్టుకున్నారు. అది సమానత్వ వేదిక. కానీ ఈ అబద్ధాల జానపదం మనల్ని చీలుస్తోంది. ఒకే ఇంట్లో తండ్రి ఒక గ్రూపు, కొడుకు ఒక గ్రూపుగా విడిపోతున్నారు. ఇద్దరూ వేర్వేరు అబద్ధాలు నమ్మి పరస్పరం శత్రువులు అవుతున్నారు. ఇంతకంటే పెద్ద మానసిక, సామాజిక పతనం ఇంకేముంటుంది? దీనికి పరిష్కారం వాట్సాప్‌ను పూర్తిగా చెరిపేయడం కాదు. మన వేలుకు మెదడును అతికించడం. ఒక మెసేజ్ ఫార్వర్డ్ చేయడానికి ముందు మనల్ని మనం ప్రశ్నించుకోవడం. భయం పుట్టించే ప్రచారాలను అక్కడికక్కడే బ్లాక్ చేయడం. లోకంలోని మంచిని స్వయంగా జానపదం చేయడం. మనిషి ఉన్నంత కాలం కథ ఉంటుంది. కథ ఉన్నంత కాలం మనిషి బతుకుతాడు. రాయి నుండి తాళపత్రానికి, తాళపత్రం నుండి పుస్తకానికి, పుస్తకం నుండి స్క్రీన్ కు వచ్చినట్లే... ఇప్పుడు ఆ కథను స్క్రీన్ నుండి మళ్లీ మనిషి గుండెల్లోకి తీసుకెళ్లాల్సిన సమయం వచ్చింది. మనమే కొత్త కథకులం కావాలి. మానవీయ జానపదం రాయాలి. గుర్తుంచుకోండి, మీరు ఫార్వర్డ్ చేస్తున్నది కేవలం ఒక సందేశం కాదు. అది ఒక తరం మనసు, ఒక జాతి భవిష్యత్తు! బటన్ మీ చేతిలోనే ఉంది. కొత్త కథను మీరే రాయాలి!

# 'పంచాయతీరాజ్' బలోపేతానికి సంస్కరణలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్థాయి పాలనను బలోపేతం చేయడానికి పలు సానుకూల చర్యలు చేపట్టడం అభినందనీయం. గ్రామసభలను చురుకుగా నిర్వహించడం, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలు గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపునిస్తున్నాయి. రహదారులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, కాలువలు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అదేవిధంగా ఈ--పంచాయతీ వ్యవస్థ, డిజిటల్ డాష్‌బోర్డులు, ఆన్‌లైన్ మానిటరింగ్, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల డిజిటల్ నమోదు వంటి చర్యల ద్వారా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతున్నాయి. ఉపాధి హామీ పథకాలతో సమన్వయం చేసి గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయడం కూడా ప్రశంసనీయమైన పరిణామం. అయితే, ఈ పురోగతితో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో కొన్ని సమస్యలు కొనసాగుతుండటం ఆందోళన కలిగించే అంశం. ప్రస్తుతం పంచాయతీరాజ్ విభాగం, గ్రామీణాభివృద్ధి విభాగాలు వేర్వేరుగా పనిచేయడం వల్ల సమన్వయ లోపం, పనుల పునరావృతం, నిర్ణయాలలో ఆలస్యం, అధికారులపై అదనపు భారం, ఉద్యోగుల సేవా సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. అందువల్ల ఈ రెండు విభాగాలను విలీనం చేసి 'కమిషనరేట్ ఆఫ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి'గా ఏర్పాటు చేయడం అవసరం. దీని ద్వారా పరిపాలనా సామర్థ్యం, ఆర్థిక నియంత్రణ, పర్యవేక్షణ, అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయి. శాఖలో స్థిరమైన కేడర్ వ్యవస్థ లేకపోవడం మరో ప్రధాన సమస్య. అనేక కీలక పోస్టులు డిప్యుటేషన్ లేదా తాత్కాలికంగా ఏర్పాటై నడుస్తున్నాయి. దీనివల్ల బాధ్యతాయుత పరిపాలనకు భంగం కలుగుతోంది. కాబట్టి డిప్యుటేషన్ విధానాన్ని పరిమితం చేసి, శాశ్వత కేడర్ పోస్టులను క్రమబద్ధమైన నియామకాల ద్వారా భర్తీ చేయాలి. 2003లో జగన్నాథం కేసులో వచ్చిన తీర్పు ఆధారంగా ప్రభుత్వం జారీ చేసిన మెమోను అమలు చేస్తూ సిక్స్ పాయింట్ ఫార్ములా, స్థానిక కేడర్, జోనల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. శాఖలో ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడానికి ప్రత్యేక అంతర్గత ఆడిట్ విభాగం ఏర్పాటు చేయాలి. ట్రెజరీ, అకౌంట్స్ శాఖకు చెందిన అర్హులైన సిబ్బందిని వినియోగించి ఆడిట్ వ్యవస్థను పటిష్ఠం చేయాలి. అలాగే ఫైనాన్షియల్ కమిషనర్ పోస్టును సృష్టించి, సీనియర్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ స్థాయి అధికారిని నియమించాలి. దీని ద్వారా వేల కోట్ల రూపాయల ప్రజా నిధుల వినియోగంపై సమర్థవంతమైన పర్యవేక్షణ, బడ్జెట్ నియంత్రణ, ఆర్థిక పారదర్శకత సాధ్యమవుతుంది. ప్రాంతీయ స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం డిప్యూటీ కమిషనర్ హోదాలో జోనల్ అధికారుల పోస్టులను కూడా సృష్టించాలి. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ఎదుర్కొంటున్న పరిపాలన, ఆర్థిక, అధికార సంబంధిత వివాదాల పరిష్కారంలో ప్రస్తుతం సమర్థవంతమైన అప్పీల్ వ్యవస్థ లేకపోవడం గమనార్హం. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, ఇతర స్థానిక సంస్థలకు సంబంధించిన అనేక కేసులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటం వల్ల న్యాయం ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక 'లోకల్ బాడీస్ ట్రైబ్యునల్' ఏర్పాటు చేయడం అవసరం. ఎన్నికైన ప్రజాప్రతినిధుల అనర్హతలు, తీర్మానాల రద్దు, ఆర్థిక అధికారాలకు సంబంధించిన వివాదాలు, పరిపాలనా నిర్ణయాలపై అప్పీలు, ఇతర స్థానిక సంస్థల సమస్యలను ఈ ట్రైబ్యునల్ నిర్దిష్ట కాలపరిమితిలో విచారించి పరిష్కరించగలదు. దీని ద్వారా సాధారణ న్యాయస్థానాలపై భారం తగ్గడమే కాకుండా స్థానిక ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుంది. గ్రామస్థాయి పరిపాలనలో సమన్వయం, బాధ్యతాయుత వ్యవస్థను నెలకొల్పేందుకు అన్ని గ్రామ సచివాలయాలను పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి తీసుకువచ్చి, వాటి పర్యవేక్షణ బాధ్యతలను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులకు అప్పగించాలి. దీని ద్వారా గ్రామస్థాయి సేవల అమలు, పర్యవేక్షణ, జవాబుదారీతనం మరింత మెరుగుపడతాయి. ప్రస్తుతం కమిషనర్, పంచాయతీరాజ్-- గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేల కోట్ల రూపాయల ప్రజా నిధులు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన పర్యవేక్షణ, బాధ్యతాయుత పరిపాలనను నిర్ధారించేందుకు పై సంస్కరణలను ప్రభుత్వం అమలు చేయాలి. ఇవి అమలులోకి వస్తే పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత పటిష్ఠమై, గ్రామ స్వరాజ్య లక్ష్యాల సాధనకు బలమైన పునాది ఏర్పడటమే కాకుండా ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేస్తుంది.

# ఎన్ని పుట్టినరోజులైనా విరసం ఇంతేనా?

విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 5న విరసం వాళ్ళు చాలా సంబరంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా 'భారతదేశంలో ఫాసిజం -- ప్రత్యేకతలు' అని ఒక కరపత్రం విడుదల చేసారు. 1500 పదాల ఈ కరపత్రంలో 'బ్రాహ్మణీయ' అనే పదం మూడుసార్లు మాత్రమే వచ్చింది. 'పెట్టుబడి', 'పెట్టుబడిదారీ', 'దళారీ', 'బూర్జువా', 'అర్ధ వలస' పదాలు మాత్రం ముప్పైసార్లు వచ్చాయి. భారతదేశంలో ఫాసిజం కేవలం 'బూర్జువా', 'అర్ధ వలస-- అర్ధ భూస్వామ్యా' లతో మాత్రమే ముడిపడి ఉన్నదా? ఫాసిజం గురించి చెప్పమన్నా, కుల వ్యవస్థ గురించి చెప్పమన్నా, అదానీ, అంబానీ లాంటి సోఫిస్టికేటెడ్ కార్పొరేట్ దురాక్రమణ గురించి మాట్లాడమన్నా -- విరసం ధోరణి అటు తిరిగి ఇటు తిరిగి 'బూర్జువా', 'అర్ధ వలస అర్ధ భూస్వామ్యా'ల దగ్గరకే వచ్చి ఆగిపోతుంది. అసలు 'ఫాసిజం' అంటే ఏమిటి? క్లుప్తంగా చెప్పుకుంటే-- నిరంకుశ లేదా నియంతృత్వ పాలన. ఫాసిస్ట్ పాలనలో సామాన్యంగా కనపడే లక్షణాలు-- అతివాద జాతీయవాదం, రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడం, పౌర హక్కులకూ స్వేచ్ఛలకూ పరిమితులు విధించడం, వ్యక్తులూ సంస్థలూ తమ స్వప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే లోబడాలని ప్రభుత్వం బలవంతపెట్టడం, అధికారాన్ని నిలబెట్టుకునేందుకు అబద్ధ ప్రచారాన్నీ (ప్రొపగాండా) బలప్రయోగాన్నీ తరచుగా వాడటం... మొదలైనవి. ఇది ముస్సోలిని పుణ్యమా అని ముందుకు వచ్చిన పొలిటికల్ ఐడియాలజీ. వ్యక్తులందరూ ఒకే జాతీయ సమూహంగా ఏకమవ్వాలి, వ్యక్తికంటే దేశమే గొప్పది, ఆ ఏకీకృత దేశాన్ని ఒక బలమైన కేంద్రీయ ప్రభుత్వం నడిపించాలి అనే విలువలను భూమికగా చేసుకుని ఫాసిజం పని చేసింది. ఇక మన దేశంలో దేశంలో ప్రస్తుత ఫాసిస్ట్ భావజాలం ఎవరి అధికార కాంక్షను కాపాడడానికో అర్థం చేసుకోవటం సులభమే. కానీ 'బూర్జువా', 'వలస వాదం', 'భూస్వామ్య వాదం', 'పెట్టుబడీదారీ వాదం' లాంటి పదాలను విరసం వాళ్ళు ఆంజనేయ దండకంలా యాంత్రికంగా వాడటమే తప్ప ఈ దేశంలో ఫాసిజం మౌలిక లక్షణాల్ని చెప్పడానికి ఎందుకు మొహమాటపడుతున్నారో అర్థం కాదు. కాంగ్రెస్ కాలంలో ఉన్న ఫాసిజానికి, బెంగాల్‌లో సీపీఎం కాలంలో ఉన్న ఫాసిజానికి, నేడు సంఘ్ పరివార్ శక్తుల హయాంలో ఫాసిజానికి తేడా లేదా? ఇప్పుడు ఉమర్ ఖలీద్‌కు బెయిల్ రాదు కానీ ఆశారం బాపూకు, డేరా బాబాకు బెయిల్ వస్తుంది. ఇంకో పక్క కేంద్ర గిడ్డంగి-- అనుబంధ గిడ్డంగుల విధానాన్ని మార్చివేసి 130 టెండర్లు పిలిస్తే, అందులో 110 టెండర్లు అదానీకే వస్తాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి చట్టాలను ఉల్లంఘించనక్కర్లేదు, పాటించాల్సిన నియమాలను మారిస్తే చాలు. అప్పుడిక ఫలితం ముందే నిర్ణయించబడిన ఆటగా మారుతుంది. 5.5 లక్షల కోట్ల విలువైన వ్యాపారం చేస్తున్న వేదాంత గ్రూప్ చైర్మన్ "దేశంలో అత్యంత క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఈ ప్రభుత్వం ఒక్కరికే (అదానీ) ధారాదత్తం చేస్తున్నది" అని స్టేట్‌మెంట్ ఇస్తే, మరుసటి రోజే ఆయన కంపెనీ మీద ఈడీ దాడులు జరిగాయి. ఇది కేవలం పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడటం కోసమే కాదు. అదే అయితే కేవలం అదానీ కోసమే నియమాలు మార్చాల్సిన అవసరం లేదు. ఇప్పుడిది 'క్రోనీ కేపిటలిజం' స్థాయిని కూడా దాటేసింది. ఇంకా దీన్ని పట్టుకుని విరసం వాళ్ళు "దళారీ బూర్జువా విధానం" అని పాతచింతకాయ పచ్చడి మాటలు వాడుతునే ఉన్నారు. అసలు పెట్టుబడీదారీవిధానం అంటేనే లాబీయింగ్ ఉండితీరుతుంది. మళ్ళీ దానికి 'దళారీ' అని ఏదో అమెరికా వాళ్ళో, చైనా వాళ్ళో మన ఆర్థిక స్థితిని తారుమారు చేస్తున్నట్టు రాయడం ఏమిటి? 'యే టాటా కౌన్ రే, యే బిర్లా కౌన్ రే' అని ఎగిరిన వాళ్ళు కాస్తా ఇప్పుడు సడన్‌గా అదానీ పిక్చర్‌లోకి వచ్చేసరికి "అరేయ్! ఇదేంటి 2000 వరకు అదానీ ఎవరో తెలీదు. ఎలా పుట్టుకొచ్చాడు. ఎవరు పెంచి పోషించారు?" అని నాలుక కొరుక్కుంటున్నారు. అసలు ఇప్పుడున్న పెట్టుబడీదారీ లక్షణాన్ని సమూలంగా అర్థం చేసుకోవడంలో తడబడుతున్నారు. అలాగే ఏదో 'ఆవు' వ్యాసం లాగ "అర్ధ భూస్వామ్య--అర్ధ వలస రాజ్య సమాజంలో ఫాసిజం వస్తే ఎట్లా ఉంటుందో హిందుత్వ కార్పొరేట్ ఫాసిజంలో చూడవచ్చు" అని రాస్తారు. 'అర్ధ వలస' అంటే ఏమిటి? ఇప్పటి అదానీ మోనోపోలీని వదిలేసి మన దేశంలో అంతకంటే చిన్న సమస్య అయిన వలసవాదం గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? వలసవాదం ప్రతి వెనుకబడిన దేశం లోనూ ఉంటుంది. ఎందుకంటే -- అక్కడ పెట్టుబడి ఎక్కువ అందుబాటులో ఉండదు.

# మర్కుక్ మండలంలో నాభిశిలా ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న తన్నీరు హరీష్ రావు

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా



గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలంలో నిర్వహించిన నాభిశిలా ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ ఇంఛార్జి ప్రతాపరెడ్డి లతో కలిసి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ ఆచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొని నాభిశిలా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని దర్శించారు.

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. ఆలయాలు గ్రామ ఆచారాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడంలో వాటి పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. అనంతరం మర్కుక్ మండల అధ్యక్షుడు మొర్సు కరుణాకర్ రెడ్డి ఇంటిలో భోజనం చేసిన అనంతరం నాయకులు కార్యకర్తలతో కాసేపు సరదాగా గడిపి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఎసి ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీ ఫోరమ్ రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, గోసుల శ్రీనివాస్ యాదవ్, కొండపాక్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, స్థానిక సర్పంచ్ మల్లేశం, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హరీష్ రావును ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

# ఆర్వీయం హాస్పిటల్లో అత్యవసర సేవలపై రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా



ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీయం హాస్పిటల్ లో అత్యవసర సేవలపై అవగాహన సదస్సు వర్క్‌షాప్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిశీచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధులుగా ?ప్రముఖ ఆసుపత్రుల భాగస్వామ్యములు ఈ సదస్సుకు పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా సిఎంసీ వెల్లూరు, కిమ్స్ , నిమ్స్ , అపోలో అయిమ్స్ బీబీనగర్ వంటి దేశీయ ప్రముఖ ఆసుపత్రులకు చెందిన అత్యవసర చికిత్స ఎమర్జెన్సీ మెడిసిన్ నిపుణులు హాజరయ్యారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ**

పీజీ విద్యార్థులకు అవగాహన: ఆర్వీయం మెడికల్ కాలేజీతో పాటు రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలల్లో ఎమర్జెన్సీ మెడిసిన్ అభ్యసిస్తున్న పీజీ విద్యార్థులకు ఈ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కల్పించారు.

రెండు రోజుల వర్క్‌షాప్ -- ప్రత్యేకతలు: ?గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి అత్యవసర వైద్యం అందించడం. ?గర్భిణీ స్త్రీలకు క్లిష్ట సమయాల్లో ప్రాణరక్షణ కల్పించడం. అదేవిధంగా ?రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులకు మానసిక ధైర్యం నింపుతూ, తక్షణమే క్రిటికల్ కేర్ చికిత్స అందించే విధానాలపై ప్రముఖ వైద్యులు ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ?ఈ కార్యక్రమంలో ఆర్వీఎం వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ యాకయ్య ఆధ్వర్యంలో జరగగా, దీనికి ముఖ్య అతిథిగా నిమ్స్ డీన్ డాక్టర్ పి. చంద్రశేఖర్ గారు విచ్చేశారు. వారితో పాటు వివిధ కళాశాలల వైద్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల లక్ష్మణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన జర్నలిస్టు నాయకుడు యూసుఫ్ బాబా



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన జర్నలిస్టు నాయకుడు యూసుఫ్ బాబా తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ప్రాంతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఉప్పల లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల సంక్షేమం, అక్రిడిటేషన్, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ మరింత చొరవ తీసుకుని కృషి చేయాలని యూసుఫ్ బాబా కోరారు. అందుకు స్పందించిన ఉప్పల లక్ష్మణ్, జర్నలిస్టుల సంక్షేమం సంస్థకు అత్యంత ప్రాధాన్యమని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల దృష్టికి అంశాలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## కన్నమేస్తూ.. ఉన్నది దోచేస్తూ..

**మెదక్ :** మెతుకుసీమలో అడపాదడపా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. తాళం వేసిన ఇళ్లు, వ్యాపార, వాణిజ్య దుకాణాలను దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆభరణాలు, నగదు అందినకాడికి దోచుకుంటుండగా, పొలాల వద్ద నియంత్రికలను ధ్వంసం చేసి ఆయిల్ వంటివి ఎత్తుకెళ్తున్నారు. రాత్రి వేళ పోలీసులు గస్తీ చేపడుతున్నా వీటికి అడ్డుకట్ట పడటం లేదు.

**ముందుగా రెక్కీ చేపట్టి..**

దొంగలు ముందుగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రెక్కీ చేపడుతున్నారు. రాత్రివేళ లోపలికి చొరబడి ఏవి దొరికితే అవి చోరీ చేస్తున్నారు. ఇటీవల బంగారం ధర పెరగడం, వాటిని ఇళ్లలోనే భద్రపర్చడం, శుభకార్యక్రమాలకు వెళ్లి వచ్చిన వారు పడకగదిలో దాచిపెడుతుండగా, పసిగట్టి ఎత్తుకెళ్తున్నారు.

**రికవరీ తక్కువే..**

ఆయా ఘటనల్లో బాధితులు పోగొట్టుకున్న సొత్తును అప్పగించడంలో జాప్యం జరుగుతోంది. గతేడాది జిల్లాలో రూ.2.43 కోట్లు విలువైన సొత్తు, నగదు చోరీకి గురవగా, కేవలం రూ.99 లక్షలే రికవరీ అయింది.

## యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిని ఆత్మీయంగా పలకరించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మిడ్జిల్ మండలం నుంచి జడ్పిటిసిగా రాజకీయ ప్రస్థానం చేసి 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఊర్కొండ అభయ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనకు వచ్చిన ముఖ్య మంత్రి వెల్దండ మండల ప్రజలు భారీ సంఖ్యలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెల్దండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ ను సీఎం ఆత్మీయంగా పలకరించి యువకులు రాజకీయాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ నిఖిల్ రెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఊర్కొండ మండలంలోని బాల్యలోక్య తండా సర్పంచ్ అంజమ్మ హనుమంతు అత్త శ్రీమతి సక్రూ బాయి అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్నమాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ మాజీ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి తండాను సందర్శించి మృతదేహానికి ఘనంగా నివాళ్ళు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆయూబ్ పాషా సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ నాయక్ రేవల్లి సర్పంచ్ బంగారు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి కాంగ్రెస్ యువజన విభాగం మండల మాజీ అధ్యక్షుడు కంతం విజయుడు స్థానిక నాయకులు ఉన్నారు.

## టీచర్ల వర్క్ అడ్జెస్ట్మెంట్ జీవో 25 ను సవరించాలి

**2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా



గజ్వేల్ నియోజకవర్గం జీవో నెంబర్ 25 సవరణ చేసిన తర్వాత టీచర్ల వర్క్ అడ్జెస్ట్మెంట్ చేపట్టాలనీ 2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్ అన్నారు. ఆదివారం మర్కుక్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియ చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేస్తూ జూన్ 20 తేదీ నాటి విద్యార్థుల ఎన్రోల్మెంట్ గణాంకాల ఆధారంగా టీచర్లను అడ్జెస్ట్మెంట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం సరైందికాదన్నారు, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా దూరమవుతుందన్నారు. ఒకవేళ ప్రభుత్వం టీచర్ల వర్క్ అడ్జస్ట్మెంట్ చేయాలనుకుంటే జూలై నెల తర్వాత విద్యార్థుల ఎన్రోల్మెంట్ ఆధారంగా సర్దుబాటు చేయాలనీ కాని జాతీయ విద్యా విధానం లో సూచించిన విధంగా 30 మందికి ఒక ఉపాధ్యాయుడు కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిలను పరిగణనలోకి తీసుకొని ప్రాథమిక పాఠశాలల్లో టీచర్ల వర్క్ అడ్జెస్ట్మెంట్ చేపట్టాలనీ ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా చూడాలని, తెలంగాణ రాష్ట్రంలో 20 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలు అధికముగా ఉన్నందున 20కి పైబడి ప్రతి 15 మంది విద్యార్థులకు అదనముగా ఒక ఉపాధ్యాయున్ని కేటాయింపు చేయాలని, అంతేకాకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు/ఎస్జీవీ పోస్టు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## చిన్ననాటి మిత్రులే - ఆపద్బంధువులు



జగదేవపూర్ వారంతా చిన్ననాటి స్నేహితులు కలిసిమెలిసి ఆటలాడుకుంటూ చదువుకున్నారు. పెరిగి పెద్దయి ఎవరికి వారు జీవితాల్లో స్థిరపడ్డారు. ఇంతలో తమతో చదివిన చిన్ననాటి మిత్రుడు మాతృమూర్తి అనారోగ్యం తో మృతి చెందిందన్న విషయం తెలిసి చలించిపోయారు ఎలాగైనా స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకొని బృందంగా ఏర్పడి చేయి చేయి కలిపి చేతనైనంత సాయాన్ని చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు నగదును సేకరించిన మొత్తాన్ని మిత్రుడికి అందజేశారు. వివరాల్లోకి వెళ్తే మండలం లోని మునిగడప గ్రామానికి చెందిన తిమ్మాపురం కృష్ణగౌడ్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు, 2005 - 2006 బ్యాచ్ కు చెందిన బాల్య మిత్రులు, గ్రామ తోటి మిత్రులు కలిసి వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకొని ఆ కుటుంబానికి సాయం చేయాలనే సంకల్పంతో రూ.53,500/- ఆదివారం స్నేహితుడికి అందజేశారు. కృష్ణగౌడ్ కుటుంబానికి ఇప్పుడు అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమలో తమకే కాదు మా తోటి మిత్రుల కుటుంబంలో ఎవరికి కష్టం వచ్చినా అందరం కలిసి ఆ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. మనం సంపాదించిన దాంట్లో లేని తృప్తి తోటి మిత్రునికి సేవ చేయడంలోనే సంతృప్తి ఆనందం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు గ్రామ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే శ్రీకారం చుట్టినట్లు గ్రామ సర్పంచ్ రజిత పరుశురాం



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ గ్రామంలో సమస్యల పరిష్కారం కోసమే వార్డు బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు గ్రామ సర్పంచ్ రజిత పరుశురాం తెలిపారు. ఆదివారం జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో సర్పంచ్ రజిత పరుశురాం, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వార్డుబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసమే వార్డు బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ప్రతి ఆదివారం గ్రామంలో వివిధ వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే సంబంధిత అధికారుల దృష్టి తీసుకపోయి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అనే వివరాలు కూడా తెలుసుకుంటామన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించడమే తమ లక్ష్యం అన్నారు. వానకాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. అంతర్గత రోడ్లు బురదమయం ఉంటే వెంటనే అక్కడ మట్టి పోయడం జరుగుతుందన్నారు. గ్రామ అభివృద్ధిలో మహిళలు, యువకులు, ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నీరజ కరుణాకర్, అశోక్, ఆంజనేయులు, లక్ష్మి నర్సింలు, నాయకులు మహేందర్ రెడ్డి , భూపతి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన గుజ్జుల మహేష్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మిడ్జిల్ జడ్పిటిసి గా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి 20 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఊరుకొండ మండలం ఊరుకొండపేట పబ్బతి ఆంజనేయస్వామి దర్శనం అనంతరం మరియు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికి శాలువాతో సన్మానించిన తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జులమహేష్ ఈ కార్యక్రమంలో, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యోగ సాధనలో పట్టుదల ఆత్మవిశ్వాసం చాలా గొప్పది

**ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్నిధార న్యూస్ (కల్వకుర్తి)

ఆమనగల్ పట్టణ కేంద్రంలో గత 70 రోజులుగా నిర్విరామంగా కొనసాగిన ఉచిత పోలీస్ ఎస్ఐ కానిస్టేబుల్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు,

ఈ సందర్భంగా శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులను అభినందించిన ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రాబోయే పోలీస్ నియామక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు, శిక్షణతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసమే విజయానికి పునాదులని పేర్కొంటూ, ప్రతి అభ్యర్థి లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు,ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే బాధ్యతతో పాటు సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని అన్నారు,పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధమైన చదువు, శారీరక దృఢత్వం, సమయపాలన, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని తెలిపారు,అపజయాలను చూసి నిరుత్సాహపడకుండా, ప్రతి ప్రయత్నాన్ని విజయానికి మార్గంగా మలుచుకోవాలని యువతకు సూచించారు,గత 70 రోజులుగా శిక్షణ తరగతులను క్రమం తప్పకుండా సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించి,ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలు




వారి ఉద్యోగ సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు,

అలాగే భవిష్యత్తులో కూడా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ ఫ్యాక్టరీ" ద్వారా ఎ ఐ భాషా నైపుణ్యాలు, ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, కల్వకుర్తి నియోజకవర్గ యువతకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగి అనే లక్ష్యంతో తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు,శిక్షణ పొందిన అభ్యర్థులు మాట్లాడుతూ,ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు ఉచిత స్టడీ మెటీరియల్ కూడా అందించి తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు, ఈ శిక్షణ తమ ప్రభుత్వ ఉద్యోగ లక్ష్య సాధనకు ఎంతో ఉపయోగపడిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని కోరాతూ,ఖర్చు తో కూడా ఈ శిక్షణ తరగతులను మారుమూల గ్రామీణ యువతకు అందరికి అందుబాటులోకి తెచ్చి ఉద్యోగాల సాధనలో మన నియోజకవర్గయువతకు దిక్సూచిగా మారిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి రుణపడి ఉంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో..అధ్యాపకులు విశ్వనాథ్,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాజీ సర్పంచ్ శ్రీరాములు, భాస్కర్, లతో పాటు శిక్షణ పొందిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత పౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**రెండు రోజుల్లో 1,200 మందికి సేవలు 46 మందికి శుక్లాల శస్త్రచికిత్సకు ఎంపిక**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ప్రముఖ శంకర నేత్రాలయ వైద్య నిపుణుల సహకారంతో తలకొండపల్లిలో నిర్వహిస్తున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం రెండో రోజూ విజయవంతంగా కొనసాగుతుంది శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రెండో రోజు దాదాపు 600 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 280 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు, 180 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ నిర్వహించారు. అలాగే 25 మంది రోగులను కంటి శుక్లాల శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సందర్శించి వైద్య బృందంతో మాట్లాడారు. శిబిరం నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు ఖరీదైన కంటి వైద్యం సైతం ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు, శుక్లాల శస్త్రచికిత్స వంటి సేవలను అందిస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఆరోగ్యానికి అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఐక్యత ఆరోగ్య భరోసా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఈ నెల 12వ తేదీ వరకు శిబిరం కొనసాగనున్నందున తలకొండపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని





కోరారు. నిర్వాహకుల వివరాల ప్రకారం, ఇప్పటివరకు రెండు రోజుల వ్యవధిలో 1,200 మందికిపైగా ప్రజలు శిబిరాన్ని సందర్శించగా, 600 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు, 350 మందికి ఉచిత కంటి అద్దాల పంపిణీ చేయడంతో పాటు 46 మంది రోగులను కంటి శుక్లాల శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్ నాయక్, కళ్యాణ్ నాయక్, ఉపసర్పంచ్‌లు భాస్కర్, దేరంగుల అనిత విజయ్, రమేష్ యాదవ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, శంకర నేత్రాలయ వైద్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ డివిజన్‌ను వన్‌టౌన్‌లో విలీనం చేయడంపై హర్షం

**రాష్ట్ర ప్రభుత్వానికి, సీపీకి కృతజ్ఞతలు తెలిపిన సీపీఐ నాయకుడు తొడుపునూరి రమేశ్‌కుమార్**




**అగ్నిధార న్యూస్,(రామగుండం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనగామ 6వ డివిజన్‌తో పాటు మరికొన్ని ప్రాంతాలను గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను సీపీఐ స్వాగతిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేశ్‌కుమార్ తెలిపారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ఇందుకోసం కృషి చేసిన రామగుండం పోలీస్ కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొన్నేళ్లుగా సీపీఐ ఆధ్వర్యంలో జనగామ ప్రాంతాన్ని వన్‌టౌన్ పరిధిలోకి తీసుకురావాలని అప్పటి, ప్రస్తుత ప్రభుత్వాలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.జనగామ డివిజన్ ప్రజలకు ఈ విలీనం పరిపాలనా పరంగా, పోలీసు సేవల పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సీపీఐ తరఫున హర్షిస్తున్నట్లు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాపా నిఖిల్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



ఊర్కొండ మండలంలోని మాదారం గ్రామానికి చెందిన ధ్యాప శ్రీకాంత్ రెడ్డి ఉ కీర్తి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాపా నిఖిల్ రెడ్డి ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆయూబ్ పాషా కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ రేవల్లి సర్పంచ్ బంగారు తదితరులు ఉన్నారు.

## మారుతున్న జీవనశైలికి జిమ్ అవసరం

**జిమ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ నాయకులు, పెర్క శ్యామ్**



అగ్నిధారన్యూస్ పెద్దపల్లి

ఆదివారం పెద్దపల్లి పట్టణంలో మేకల రాజయ్య నూతనంగా ఏర్పాటు చేసిన స్కై ఫిటినెస్ జిమ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టిపిసిసి నాయకులు, పెర్క శ్యామ్ హాజరయ్యారు .ఈ సందర్భంగా పెర్క శ్యామ్ మాట్లాడుతూ, నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత వ్యాయామాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఫిటినెస్‌పై అవగాహన పెంచే ఇలాంటి జిమ్ సెంటర్లు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.యువతకు ఆధునిక సౌకర్యాలతో కూడిన జిమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన మేకల రాజయ్యను అభినందిస్తూ, అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఈ జిమ్ కీలక పాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, యువకులు, అభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని నూతన జిమ్ సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## హైదరాబాద్‌లో తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం.



**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు చేరవేయడంలో మీడియా బాధ్యత ఎంతో గొప్పదని ఆయన అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవం, భద్రత కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు రమణారావు పాల్గొని సంస్థ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న చర్యలపై వివరించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల అక్రిడిటేషన్ కార్డు కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, అక్రిడిటేషన్ ప్రక్రియ, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ, సంస్థ బలోపేతం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలు ఆమోదించారు.

## ఆదివరహస్వామి ప్రధాన రహదారి సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 95 లక్షలు మంజూరు



అగ్నిధార న్యూస్ కమన్పూర్

మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్, డైరెక్టర్లు

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆదివరహాస్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి సిసి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈజిఎస్ నిధుల నుంచి రూ. 95 లక్షలు మంజూరు చేయించారు. ఈ పనులను ఆదివారం రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పులి దేవేందర్ రెడ్డి( పిడిఆర్) ప్రారంభించారు. ఆదివరహ దేవస్థానం చైర్మన్ ముస్త్యాల దామోదర్, కమాన్‌పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఆలయ కమిటీ డైరెక్టర్లు కాంట్రాక్టర్ తో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఆలయానికి వెళ్లే రహదారి దెబ్బతినడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి, రహదారి అభివృద్ధి కోసం సుమారు రూ. 95 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబుకు దేవస్థానం పాలకవర్గం, గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయిన అనంతరం ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించబడటంతో పాటు దేవస్థానం అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి కొనసాగుతుందని ఆలయ చైర్మన్ దామోదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్, దేవస్థానం డైరెక్టర్లు తీగల రాజయ్య, బూస శ్రీనివాస్ గౌడ్, చాట్ల రాయమల్లు, కుందారపు శంకర్, కొంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఇంటర్మీడియట్ ప్రవేశాలకు 6న స్పాట్ కౌన్సిలింగ్

అగ్నిధారన్యూస్ మంథని:

సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఈనెల 6న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ ఆదివారం ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల మంథని, పెద్దపల్లి (బాలురు)లో, రామగుండం, మల్లాపూర్, నంది మేడారం, గర్రెపల్లి (బాలికలు) కళాశాలలో మిగిలిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ( బైపిసి, ఎంపీసీ, సిఇసి, హెచ్ఈసి) సీట్లకు ఆరో తేదీన (సోమవారం) స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రవేశ పరీక్షలో ప్రతిభ ద్వారా రెండు విడతల్లో సీట్ల భర్తీ చేయడం జరిగిందని వివరించారు. మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సిలింగ్ ను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల (బాలురు) మంథనిలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందని ఆ తర్వాత స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వివరించారు. స్పాట్ కౌన్సిలింగ్ కు హాజరయ్యే అర్హులైన అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ( పదవ తరగతి ఉత్తీర్ణత పత్రం), కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ దృవీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ పత్రాలు రెండు సెట్లు, విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్థి నాలుగు ఫోటోలు తీసుకొని కౌన్సిలింగ్ సెంటర్ కు రాగలరని సూచించారు.



## బిజినెస్

### హోండా కారుపై రూ.2.15 లక్షల డిస్కౌంట్!



జూలై 2026 నెలలో హోండా కార్స్ ఇండియా.. ఎంపిక చేసిన కొన్ని కార్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను, ప్రయోజనాలను ప్రకటించింది. ఇందులో నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ బెనిఫిట్స్ వంటి ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఈ ఆఫర్స్ కేవలం జూలై 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. హోండా ఎలివేట్ కారుపై కంపెనీ గరిష్టంగా రూ.2.15 లక్షల డిస్కౌంట్ అందిస్తోంది. ఇందులో రూ. 40,000 వరకు నగదు తగ్గింపు, రూ. 30,000 వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనం, కార్పొరేట్ ఆఫర్లు, లాయల్టీ ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణంగా హోండా ఎలివేట్ ధరలు రూ. 11.60 లక్షల నుంచి రూ. 16.16 లక్షల మధ్య ఉన్నాయి. అయితే ఇది దేశీయ విఫణిలో హ్యుందాయ్ క్రెటా , కియా సెల్టోస్ , టాటా సియెర్రా, మారుతి విక్టోరిస్, మారుతి గ్రాండ్ విటారా, రెనాల్ట్ డస్టర్‌లకు ప్రత్యర్థిగా ఉంటుంది. సెడాన్ల విభాగంలో కొత్త హోండా అమేజ్ కొనుగోలుపై రూ. 67,000 వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. హోండా అమేజ్ సెకండ్ జనరేషన్ మోడల్ మీద రూ. 58,000 వరకు డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్ కొనుగోలుపైన ఎలాంటి తగ్గింపులు లేదు. ఎందుకంటే ఈ కారు ఇటీవలే షోరూమ్‌లలోకి వచ్చింది. చీశేవ: కంపెనీ అందించే డిస్కౌంట్స్ లేదా ప్రయోజనాలు నగరాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కాబట్టి కొనుగోలుదారులు మీరు కొనే కారుపై ఎంత డిస్కౌంట్ లభిస్తుంది అనే వివరాలను ఖచ్చితంగా తెలుసుకోవడానికి సమీపంలోని డీలర్షిప్ సందర్శించాలి.

### ఒక్కసారిగా రూ.60 వేలు.. పెరిగిన విండ్సర్ ఈవీ ధర!

భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. ఎంజీ ఇండియా తన విండ్సర్ ఈవీ ధరలను పెంచింది. జూలై 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ ధరల పెంపు అన్ని వేరియంట్లకు వర్తిస్తుంది. ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఇటీవల కియా, టయోటా వంటి ఇతర వాహన తయారీ సంస్థలు కూడా తమ కార్ల ధరలను పెంచిన నేపథ్యంలో ఎంజీ కూడా ఇదే బాటలో నడిచింది. ఎంజీ విండ్సర్ ఈవీ మొత్తం ఐదు వేరియంట్లలో అందుబాటులో ఉంది. వీటిలో ఎక్స్‌సైట్ బేస్ వేరియంట్‌పై అత్యధికంగా రూ.60,000 పెంపు జరిగింది. దీంతో దీని ధర రూ.14.10 లక్షల నుంచి రూ.14.70 లక్షలకు చేరింది. ఎక్స్‌క్లూజివ్ వేరియంట్ ధర రూ.46,900 పెరిగి రూ.16 లక్షలకు చేరగా, ఎసెన్స్ వేరియంట్ కూడా అదే మొత్తంతో పెరిగి రూ.17 లక్షలకు చేరింది. ఎక్స్‌క్లూజివ్ ప్రో వేరియంట్ ధర రూ.52,000 పెరిగి రూ.17.90 లక్షలకు చేరుకుంది. టాప్ వేరియంట్ అయిన ఎసెన్స్ ప్రో ధర రూ.40,000 పెరిగి రూ.19 లక్షలుగా నిర్ణయించారు. మొత్తం మీద వేరియంట్‌లను బట్టి ధరల పెంపు 2.15 శాతం నుంచి 4.26 శాతం వరకు పెరిగిందని స్పష్టమవుతోంది. ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపుతుందా?, లేదా? అనేది తెలియాల్సి ఉంది.

# అదానీ గ్రూప్ భారీ ఆసుపత్రి..
# 1,000 బెడ్లు పేదలకు ఉచితం

పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆరోగ్య రంగంలో మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో ఒక అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఇందులో సగం పడకలను అంటే 1,000 బెడ్లను పేద రోగులకు పూర్తిగా ఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. గత శనివారం తన నియోజకవర్గం భవానీపూర్‌లో పౌర సమాజ ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశంలో సీఎం సువేందు అధికారి మాట్లాడారు. తమ ప్రభుత్వం గత రెండు నెలల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ, అదానీ గ్రూప్ ఆసుపత్రి ఏర్పాటుకు లిఖితపూర్వక హామీ ఇచ్చిందని స్పష్టం చేశారు. ఈ ఆసుపత్రిలో 1,000 పడకలను పేదల ఉచిత వైద్యానికి, మిగిలిన 1,000 పడకలను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తారని ఆయన వివరించారు. అదానీ గ్రూప్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో పలు కార్యక్రమాలు చేపడుతోంది. గతంలో బీహార్‌లో అఖండ జ్యోతి ఆసుపత్రితో కలిసి 'అదానీ సెంటర్ ఫర్ ఐ డిసీజెస్'ను ప్రారంభించింది. ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీలో కిడ్నీ సంబంధిత వ్యాధుల చికిత్స ప్రాజెక్టును కూడా విస్తరించింది. ఈ సందర్భంగా అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. "ఒక వ్యక్తికి కంటిచూపు ఇవ్వడమంటే కేవలం వైద్యం అందించడం కాదు, వారి జీవితంలోకి ఆశ, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని తిరిగి తీసుకురావడం" అని అన్నారు. కోల్‌కతాలో ఏర్పాటు చేయనున్న ఈ కొత్త ఆసుపత్రి, అదానీ గ్రూప్ ఆరోగ్య సేవల విస్తరణలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.




# బంగారు అభరణాలపై రుణం తీసుకుంటున్నారా?
# ఈ పొరపాట్లు అస్సలు చేయొద్దు!

ఇటీవల కాలంలో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరిగినప్పటికీ ప్రస్తుతం ధరలు క్రమంగా దిగి వస్తున్నాయి. అయితే బంగారానికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. మహిళలకు ధరించేందుకు వాడుకోవడమే కాకుండా కష్ట సమయాల్లో ఎంతగానో ఆదుకుంటుంది. అత్యవసరంగా నగదు అవసరమైన వారు తమ బంగారు ఆభరణాలను అమ్మకుండా వాటిని తాకట్టు పెట్టి గోల్డ్ లోన్ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం విద్య, వైద్యం, వ్యాపార అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులు లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం చాలామంది గోల్డ్ లోన్‌ను ఎంచుకుంటున్నారు. బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు కూడా తక్కువ సమయంలో రుణం మంజూరు చేయడం వల్ల ఈ రుణాలకు డిమాండ్ మరింత పెరుగుతోంది. నిపుణుల వివరాల ప్రకారం.. బంగారంపై రుణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటీవల విడుదలైన ఎక్స్‌పీరియన్ నివేదిక ప్రకారం, భారతదేశంలో రిటైల్ రుణాల వృద్ధికి ప్రస్తుతం గోల్డ్ లోన్లు ప్రధాన కారణంగా మారాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రిటైల్ రుణాల్లో గోల్డ్ లోన్ల వాటా 18 శాతంగా ఉండగా, 2026 నాటికి అది 41 శాతానికి చేరిందని నివేదిక చెబుతున్నాయి. గత ఐదేళ్లలో అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు దాదాపు 130 శాతం వరకు పెరగడం కూడా దీనికి ప్రధాన కారణంగా పేర్కొంది. బంగారం విలువ పెరగడంతో అదే ఆభరణాలపై రుణగ్రహీతలు మరింత ఎక్కువ మొత్తాన్ని పొందగలుగుతున్నారు. ఇప్పుడు మీకు బంగారంపై ఎక్కువ రుణం లభించే అవకాశాల ఉన్నాయి. మీరు బ్యాంకుల్లో గానీ, ఇతర సంస్థల్లో



గానీ బంగారంపై రుణం పొందాలనుకుంటే గతంలో కంటే అధిక మొత్తంలో రుణం మంజూరు చేసే అవకాశం ఉంది. 2024 జనవరి-మార్చి త్రైమాసికంలో గోల్డ్ లోన్ల పంపిణీ విలువ రూ.483 కోట్లుగా ఉండగా, 2026 ఇదే కాలానికి అది రూ.981 కోట్లకు పెరిగింది. మీరు మొదటిసారి బంగా రంపై రుణం తీసుకుంటున్నట్లయితే ఈ పొరపాట్లు అస్సలు చేయవద్దని సూచిస్తున్నారు నిపుణులు. వారు చేసే సాధారణ తప్పుల్లో ఒకటి గరిష్టంగా ఎంత రుణం వస్తుందనే అంశానికే ప్రాధాన్యత ఇవ్వడం. కానీ రుణం తీసుకునేటప్పుడు మొత్తం ఖర్చును కూడా పరిశీలించడం చాలా ముఖ్యం.

# ఇంగ్లండ్ కల చెదిరింది

## ఏడో టీ20 వరల్డ్‌కప్‌తో మురిసిన ఆస్ట్రేలియా..!






మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్లో అద్భుతం జరగలేదు. ఆరుసార్లు విజేత ఆస్ట్రేలియా జోరుకు తలొగ్గిన ఇంగ్లండ్ కప్‌ను అప్పగించింది. లార్డ్స్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో రెచ్చిపోయిన ఆసీస్ రికార్డు స్థాయిలో ఏడోసారి పొట్టి కప్‌ను ముద్దాడింది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 151 లక్ష్య ఛేదనలో బేత్ మూనీ(64), ఫొబో లిచ్‌ఫీల్డ్0(48) ఉతికేశారు. పవర్ ప్లేలోనే 62 కొట్టిన కంగారూ టీమ్.. 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. నాలుగోసారి పొట్టి కప్ ఫైనల్లో కంగుతిన్న ఇంగ్లండ్ సొంతగడ్డపై చెక్కుచెదరని రికార్డును చేజేతులా పోగొట్టుకుంది. ఐసీసీ ఈవెంట్లలో తామెంత ప్రమాదకరమో ఆస్ట్రేలియా మరోసారి చాటింది. ఫైనల్ వెళ్తే కప్ వదలేది లేదు అన్నట్టు ఆడే ఆసీస్.. ఏడోసారి టీ20 ప్రపంచకప్‌ను ఒడిసిపట్టింది. లీగ్ దశ నుంచి ఓటమెరుగని ఇంగ్లండ్‌ను సొంతగడ్డపై మట్టికరిపించిన కంగారూ టీమ్ తమ స్టయిల్లో విశ్వవిజేతగా నిలిచింది. ఆదివారం లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌ను బంతితో నిలువరించిన ఆస్ట్రేలియా బ్యాటతో రెచ్చిపోయింది. 151 పరుగుల మోస్తరు ఛేదనను ఆసీస్ దూకుడుగా మొదలెట్టింది. తొలి బంతినే బౌండరీకి పంపిన ఓపెనర్ జార్జియా వోల్(9)ను లారెన్ బెల్ బౌల్డ్ చేసి ఆదిలోనే బ్రేకిచ్చింది. కానీ, బిగ్ మ్యాచ్ ప్లేయర్ బేత్ మూనీ(64) ఒత్తిడికి లోనవ్వకుండా ఫొబే లిచ్‌ఫీల్డ్(48)తో కలిసి దంచేసింది. వీరిద్దరి ఉతుకుడుతో ఆసీస్ పవర్ ప్లేలో 62 పరుగులు చేసింది. శతక బాగస్వ?వ్యం నెలకొల్పిన లిచ్‌ఫీల్డ్‌ను డీన్ బౌల్డ్ చేసింది. కానీ, అప్పటికే ఆసీస్ విజయం వాకిట నిలిచింది. ఎలీసా పెర్రీ(13 నాటౌట్) జతగా లాంఛనం ముగించాలనుకున్న మూనీ ఎల్బీగా వెనుదిరిగింది. గార్డ్‌నర్(5 నాటౌట్) బౌండరీతో ఆసీస్ ఏడు వికెట్లతో విజయం సాధించింది.

### బ్రంట్ అర్ధ శతకంతో

టాస్ ఓడిన ఇంగ్లండ్‌కు ఫైనల్లో శుభారంభం దక్కలేదు. ఓపెనర్ అమీ జోన్స్(6)ను ల్యూసీ హామిల్టన్ ఔట్ చేయగా.. డేంజరస్ డాని వ్యాట్ హెడ్జ్(8) సైతం విఫలమైంది. టపటపా రెండు కీలక వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(58 నాటౌట్) బాధ్యతగా ఆడింది. ఒత్తిడిలోనూ ధనాధన్ ఆడిన అలలీసే క్యాప్సే(23) ఆసీస్ బౌలర్ల లయను దెబ్బతీసింది. అయితే.. గార్డ్‌నర్ వేసిన 9 ఓవర్లో క్యాప్సే 6, 4, 4 తో 16 రన్స్ పిండుకోగా స్కోర్ 60 దాటింది. అదే విధంగా ధాటిగా ఆడే క్రమంలో మొలినెక్స్ వేసిన బంతిని స్కూప్ చేయబోయి క్యాప్సే బౌల్డయ్యింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే హీథర్ నైట్(2) వికెట్ల ముందు దొరికిపోయింది. అంతే.. ఇంగ్లండ్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. చూస్తుండగానే నాలుగు వికెట్లు పడినా.. కెప్టెన్ బ్రంట్ పట్టువదల్లేదు. ఫ్రెయా కెంప్(44 నాటౌట్)తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించింది. తొలుత సింగిల్స్, డబుల్స్ తీసిన కెంప్ కాస్త కుదురుకున్నాక బౌండరీలతో స్కోర్ వేగం పెంచింది. సథర్‌లాండ్ ఓవర్లో తను రెండు ఫోర్లు బాదగా స్కోర్ వందకు చేరింది. ధాటిగా ఆడి 37 బంతుల్లో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిందీ జంట. మొలినెక్స్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో కెంప్ స్ట్రెయిట్ సిక్సర్‌తో ఆతిథ్య జట్టు 4 నష్టానికి 150 పరుగులు చేయగలిగింది.

## స్పోర్ట్స్

### క్వార్టర్ ఫైనల్లో జకోవిచ్.. ఫెదరర్ ఆల్‌టైమ్ రికార్డు బద్ధలు..!




వింబుల్డన్‌లో నొవాక్ జకోవిచ్ జోరు చూపిస్తున్నాడు. పురుషుల సింగిల్స్‌లో అతడు క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. ఆదివారం హోరాహోరీగా జరిగిన ప్రీ-క్వార్టర్స్ పోరులో రోమన్ సఫీల్లిన్(రష్యా)ను చిత్తు చేశాడు. ఈ విక్టరీతో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్(=శీస్త్రవతీ ఖీవసవతీవతీ) ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టాడు జకో. వింబుల్డన్‌లో 106వ విజయంతో ఫెదరర్‌ను అధిగమించాడీ సెర్బియా స్టార్. ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ జకోవిచ్ ఈసారి చెలరేగిపోతున్నాడు. 25వ గ్రాండ్‌స్లామ్‌పై గురి పెట్టిన జకో.. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరుకున్నాడు. రోమన్ సఫీల్లిన్(రష్యా) నుంచి గట్టి పోటీ ఎదురైనా చివరకు.. 7-6(6), 6-3, 3-6, 6-3తో గెలుపొందిన అతడు ఫెదరర్ పేరిట ఉన్న అత్యధిక విజయాల(105) రికార్డును తన వశం చేసుకున్నాడు. ఆదివారం సెంటర్ కోర్టులో రోమన్‌ను ఓడించడం ద్వారా ఈ మాజీ విజేత ఈ గ్రాస్ కోర్టు టోర్నీలో 106వ విజయం నమోదు చేశాడు. ఓపెన్ ఎరాలో ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో ఇన్నేసి విక్టరీలు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.



# ‘అయ్యగారే నెం.1’ నినాదంపై అఖిల్ స్పందన.. నాకు నంబర్ వన్ కావాలనే లక్ష్యం లేదంటూ కామెంట్


అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘లెనిన్’ విడుదలకు సిద్ధమవుతోంది. జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అఖిల్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ తన సినీ ప్రయాణం, అభిమానులతో ఉన్న అనుబంధం, కెరీర్‌పై తన ఆలోచనలను పంచుకుంటున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో “అయ్యగారే నెం. 1” అనే నినాదంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో “అయ్యగారే నెం. 1c అంటూ వైరల్ అయిన అభిమాని గురించి మాట్లాడుతూ అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. ఒక అభిమాని తనపై చూపించిన ప్రేమ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎక్కడికి వెళ్లినా అందరూ ‘అయ్యగారు... అయ్యగారు’ అని పిలుస్తున్నారు. ఈ పేరు నాకు అభిమానులు ఇచ్చిన ప్రేమకు నిదర్శనం. నాన్న నాగార్జునకు ‘కింగ్’ అనే ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లే, నాకు ‘అయ్యగారు’ అనే పేరు సహజంగానే వచ్చేసింది. ఇది నాకు ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు” అని అఖిల్ చెప్పారు. అభిమానులు తరచూ “అయ్యగారే నెం. 1c అని అనడం గురించి స్పందిస్తూ అఖిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజం చెప్పాలంటే ‘నంబర్ వన్’ కావాలనే లక్ష్యం నాకు లేదు. నంబర్ వన్ అనేది ప్రతి ఒక్కరి అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. ఒకరికి నంబర్ వన్ అనిపించే వ్యక్తి, మరొకరికి కాకపోవచ్చు. అందుకే ఆ పోలికల గురించి నేను ఎక్కువగా ఆలోచించను” అని స్పష్టం చేశారు. తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమ తనకు మరింత బాధ్యతను పెంచుతుందని అఖిల్ అన్నారు. అభిమానులు నాపై ఇంత ప్రేమ చూపిస్తున్నప్పుడు, వారి అంచనాలను అందుకోవాలనే బాధ్యత కూడా నాపై ఉంటుంది. వారి ప్రేమ, ఉత్సాహం నాకు మరింత కష్టపడేలా ప్రేరణ ఇస్తాయి. వారిని ఎప్పుడూ నిరాశపరచకూడదనేదే నా ప్రయత్నం అని చెప్పారు. తెలుగు సినీ అభిమానుల్లో కొన్ని ప్రత్యేక నినాదాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని చెబుతూ, “జై బాలయ్య” తరహాలో “అయ్యగారే నెం. 1” కూడా తనతో ఎప్పటికీ ముడిపడి ఉండిపోతుందని అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలో తన గత చిత్రాలైన ‘హలో’, ‘మిస్టర్ మజ్ను’, ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్’ గురించి కూడా అఖిల్ మాట్లాడారు. ఆ సినిమాల్లో తాను పోషించిన పాత్రలు మహిళలను గౌర వించే యువకులుగా ఉండటం తనకు ఎంతో నచ్చిందన్నారు. ముఖ్యంగా ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్’ చిత్రంలోని హర్ష పాత్ర గురించి మాట్లాడుతూ, ఆ పాత్రలో ఉన్న విలువలు ప్రతి అమ్మాయి కోరుకునే లక్షణాలు. అలాంటి పాత్ర చేయడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది అని తెలిపారు.



# ఓఆర్ఆర్ వద్ద పది ఎకరాలు కొనొచ్చు

సత్యదేవ్ హీరోగా వచ్చిన లేటెస్ట్ మూవీ రావు బహదూర్. ఈ నెల 3న థియేటర్లలో రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సక్సెస్ టాక్‌తో దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జంటగా దీపా థామస్ హీరోయిన్‌గా మెప్పించింది. ఈ మూవీకి కేరాఫ్ కంచరపాలెం ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. మహేశ్ బాబు– –నమ్రతా శిరోద్కర్ జీఎంబీ ఎంటర్‌టైన్ మెంట్ సమర్పణలో ఏ ప్లస్ ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్స్ చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించారు. ఈనెల 3న థియేటర్లలో రిలీజైన ఈ ?సినిమాకు తొలిరోజు నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంటోంది. హిట్ టాక్ రావడంతో జనాలు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూవీ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు హాజరైన సత్యదేవ్ తన సినిమాల గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. గతంలో తన మూవీస్ చాలా నిరాశ పరిచాయని అన్నారు. రావు బహదూర్ లాంటి గొప్ప సినిమాను చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సత్యదేవ్ మాట్లాడుతూ..’ గతంలో నా సినిమాలు వచ్చినప్పుడు .. ఇది వర్కవుట్ అవుతుందని చెప్పేవారు. అంతేకాదు ఈ మూవీ హిట్ అయితే మీరు ఓఆర్ఆర్ వద్ద ఓ పది ఎకరాలు కొనొచ్చు అనేవారు. నాకు డిసప్పాయింట్‌మెంట్ అనేది కొత్త కాదు. దాంతో నేను, మహా సహజీవనం చేస్తుంటాం. సక్సెస్ అనేది కొత్త. ఈ రోజు సక్సెస్ వచ్చింది అనే పాయింట్ కంటే.. ఈ సినిమా జనాలు చూడకపోతే ఒక గొప్ప చిత్రాన్ని కోల్పోతారనే ఫీలింగ్ వచ్చింది. ఈ మూవీ జనాలు చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది’ అని అన్నారు.






# ‘ఫౌజీ’ విజువల్స్ చూసి మైండ్ బ్లాక్ అయింది..

## ప్రభాస్ సినిమాపై నాగవంశీ షాకింగ్ కామెంట్స్!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, ‘సీతారామం’ ఫేమ్ దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో రాబోతున్న హిస్టారికల్ పీరియడ్ వార్ అండ్ లవ్ డ్రామా ‘ఫౌజీ’పై రోజురోజుకూ అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హను రాఘవపూడి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఈ పాన్–ఇండియా విజువల్ వండర్‌ను నిర్మిస్తోంది. వచ్చే వింటర్ కానుకగా, డిసెంబర్ 2026లో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ పంచుకున్న ఒక క్రేజీ అప్‌డేట్ ప్రభాస్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తోంది. ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ తనకు ‘ఫౌజీ’ సినిమాకు సంబంధించిన కొన్ని రషెస్ చూపించారని, అవి చూశాక తనకు మైండ్ బ్లాక్ అయిందని నాగవంశీ పేర్కొన్నారు. చిత్ర యూనిట్ ఈ సినిమాను మనం ఊహించని రేంజ్‌లో, ఒక సరికొత్త హాలీవుడ్ లెవెల్‌లో తెరకెక్కిస్తోందని ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. నాగవంశీ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో నిమిషాల్లో వైరల్‌గా మారడంతో, ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే సినిమా ప్రమోషన్స్ షురూ చేయాలని, అఫీషియల్ టీజర్ లేదా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయాలంటూ ఫ్యాన్స్ నెట్టింట ట్రెండ్ చేస్తున్నారు. ఈ అద్భుతమైన చిత్రంతో సోషల్ మీడియా సెన్సేషన్ ఇమాన్వి హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతుండటం విశేషం. అలాగే బాలీవుడ్ దిగ్గజ నటులు మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, సీనియర్ నటి జయప్రద, రాహుల్ రవీంద్రన్, చైత్ర జె. ఆచార్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించబోతుందో చూడాలి.



# ‘రౌడీ జనార్దన’లో బాలీవుడ్ భామ.. లైగర్ బ్యూటీతో మళ్లీ రౌడీ స్టార్ రొమాన్స్?

టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ, క్రేజీ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘రౌడీ జనార్దన’ గురించి రోజుకో ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. పక్కా గ్రామీణ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత, స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో ఒక అదిరిపోయే మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్‌లో విజయ్ దేవరకొండతో కలిసి బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే స్టెప్పులు వేయబోతున్నట్లు గట్టిగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరూ ‘లైగర్’ సినిమాలో కలిసి నటించిన సంగతి తెలిసిందే, ఒకవేళ ఈ వార్త నిజమైతే మరోసారి ఈ జోడి వెండితెరపై సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ స్పెషల్ సాంగ్ ఆఫర్‌కు అనన్య గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించేలా ఉంటాయని ఇన్సైడ్ టాక్. ముఖ్యంగా ఈ ఫ్లాష్ బ్యాక్‌లో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఊరమాస్ లుక్‌తో కనిపించబోతున్నాడట. ఇందులో వచ్చే యాక్షన్ సీక్వెన్సులు సినిమా మొత్తానికే మేజర్ హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో సీనియర్ యాంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రతో పాటు లుక్ కూడా ఇప్పటివరకు మనం చూడని రీతిలో సరికొత్తగా, ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. మొత్తానికి భారీ తారాగణం, అదిరిపోయే యాక్షన్ ఎలిమెంట్స్, విలేజ్ బ్యాక్‌డ్రాప్ స్టోరీతో తెరకెక్కుతున్న ‘రౌడీ జనార్దన’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులను సృష్టిస్తుందో చూడాలి.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com